ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 119, పేజీలు - 08

శుక్రవారం,అక్టోబర్ 30, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

ధరల భారం.. ప్రజాగ్రహం

సర్కార్ల వ్యూహం!

- ఓటు బ్యాంకుకు గండం పడకుండా సర్కారుల కసరత్తు
- ఏపీలో తక్కువ ధరకే సరుకులు
- తెలంగాణలో సబ్సిడీ కిట్ల పంపిణీకి కసరత్తు
- ఆర్థిక భారమైనా వెనక్కి తగ్గని ప్రభుత్వాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రస్తుత రాజకీయాల్లో ప్రభుత్వాలపై ప్రజల్లో అసంతృప్తి పెరగడానికి పెద్ద పెద్ద సమస్యలు, సిద్ధాంతపరమైన విభేదాలే అవసరం లేదు. సామాన్యుడి ఇంటి వంటగది బడ్జెట్ తలకిందులైతే చాలు పాలకులపై ప్రజాగ్రహం పెల్లుబుకుతుంది. ప్రతిరోజూ వినియోగించే కూరగాయలు, పప్పులు, వంటనూనెలు, ఇతర నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటితే ఆ ప్రభావం నేరుగా ప్రభుత్వాల ప్రజాదరణపై పడుతుంది. సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చినా, మరోవైపు పెరిగిన ధరలు కుటుంబ బడ్జెట్‌ను కుదేలు చేస్తే ప్రజల్లో అసంతృప్తి తప్పదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నిత్యావసరాల ధరల పెరుగుదల ఇదే పరిస్థితిని సృష్టిస్తోంది. ఎల్‌నినో ప్రభావం, అకాల వర్షాలు, పండుగల సమయంలో పెరిగిన డిమాండ్, వాతావరణ మార్పుల నేపథ్యంలో ధరల సెగ సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో ధరల భారం ప్రజావ్యతిరేకతగా మారకముందే ఉపశమనం కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలపై దృష్టి సారిస్తున్నాయి. కోట్లాది రూపాయల ఆర్థిక భారాన్ని భరించైనా ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు అందించాలనే ప్రయత్నాలు రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఏపీలో తక్కువ ధరలకే నిత్యావసరాలు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులకు ఉపశమనం కల్పించేందుకు ప్రత్యేక కౌంటర్లు, ప్రజా పంపిణీ వ్యవస్థను వినియోగించుకుంటోంది. నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువ ధరలకు నిత్యావసరాలను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కిలో కందిపప్పును రూ.100కు, లీటర్ పామాయిల్‌ను రూ.125కు, గోధుమపిండిని రూ.25కు అందించడంతో పాటు, ధరణి బ్రాండ్ బియ్యాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా ప్రజలకు చేరువ చేసే చర్యలు చేపడుతోంది. ప్రభుత్వమే తక్కువ ధరలకు సరుకులను అందించడం వల్ల బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలపై ఒత్తిడి తగ్గుతుందని, తద్వారా సామాన్యులకు కొంత ఊరట లభిస్తుందని భావిస్తోంది.

తెలంగాణలో నిత్యావసర కిట్ల పంపిణీకి కసరత్తు

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఉపశమనం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులతో కూడిన ప్రత్యేక సబ్సిడీ కిట్లను పంపిణీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పప్పు దినుసులు, వంటనూనెలు, గోధుమపిండి, చక్కెర తదితర ఆరు రకాల నిత్యావసరాలను కిట్ల రూపంలో అందించడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అదే సమయంలో బహిరంగ మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచే వ్యాపారులపై తనిఖీలు ముమ్మరం చేయడం, సరుకుల లభ్యతను పర్యవేక్షించడం వంటి చర్యలపైనా దృష్టి సారిస్తోంది. ప్రభుత్వం నేరుగా సబ్సిడీ సరుకులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు ఊరట కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో సానుకూలతను పెంచుకోవాలని భావిస్తోంది.

ఆర్థిక భారమైనా.. తప్పని పరిస్థితి!

రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక లోటు, రుణభారంతో సతమతమవుతున్నప్పటికీ నిత్యావసరాల ధరల నియంత్రణకు అదనపు నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి ప్రధాన కారణం సామాన్యుల ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వాలపై వ్యతిరేకతగా మారే ప్రమాదమేనన్న

2లో..

బాధితులకు బ్యాంకులే పరిహారం చెల్లించాలి

- డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో వెలుగు చూస్తోన్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సర్వోన్నత నాయస్థానం గురువారం తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వ ప్రచారాలు, మీడియా కథనాలు, కోర్టు ఉత్తర్వులు ఇన్ని ఉన్నప్పటికీ విద్యావంతులు కూడా ఎలా మోసపోతున్నారో అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుమోటోగా విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. "ఈ బాధితులకు ఏమైంది? వీళ్లు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు?

2లో..

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

- సాగునీటి నిర్వహణలో చంద్రబాబు భేష్

- కరవు పరిస్థితులను చంద్రబాబు గొప్పగా నిర్వహించారన్న కేటీఆర్
- అక్కడ లేని కరవు తెలంగాణలో ఎందుకుందని ప్రభుత్వంపై విమర్శ
- కొండా సురేఖ ఏం చెప్పారో పూర్తిగా చూడలేదని వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో నెలకొన్న నీటి ఎద్దడి, కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థతలేని పాలన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం విలేకరుల సమావేశంలో పలు ఆసక్తికర విషయాలను మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల్లో నీటి యాజమాన్య పద్ధతులను ఉదాహరణగా చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై

2లో..

తుఫాను తాండవం.. 4600 కోట్ల గాయం

- అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే
- బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా
- రెండు రోజుల్లో 100% విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యమని ప్రకటన
- రూ.4600 కోట్ల ప్రాథమిక నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక
- నష్టపోయిన రైతులకు పరిహారం, పునరావాస శిబిరాల నుంచి వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీ

(తోట వెంకట్ - ఏపీ ప్రతినిధి)

"తుపానును మనం పూర్తిగా నివారించలేం. కానీ, మనకు ఉండే ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో గురువారం ఆయన కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు.

2లో..

పేదల బియ్యంపై దోపిడీ దందా!

- రేషన్ బియ్యం స్కామ్ గుట్టురట్టు
- రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ పేరుతో విక్రయం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పరిధిలో దర్జాగా సాగుతున్న భారీ రేషన్ బియ్యం మాఫియా అక్రమాలను సివిల్ సప్లైస్, విజిలెన్స్ చెక్ పెట్టాయి. పేదలకు ప్రభుత్వం అతి తక్కువ ధరకు లేదా ఉచితంగా సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని దళారులు అక్రమ మార్గాల్లో సేకరించి, వాటిని రీ-సైక్లింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లైస్, విజిలెన్స్

2లో..

తెలంగాణలో పెట్టుబడులకు నా భరోసా!

- పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

- పెట్టుబడులు రెట్టింపు చేయండి.. వృద్ధి, లాభాలూ పెంచుకోండి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- కేంద్ర సహకారంతో మౌలిక సదుపాయాల విస్తరణ.. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పెట్టుబడుల భద్రత నుంచి ప్రభుత్వ విధానాల రూపకల్పన వరకు, పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే అడ్డంకుల తొలగింపు నుంచి వ్యాపార విస్తరణ వరకు అవసరమైన సహకారం అందించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ పారిశ్రామికవేత్తలు ప్రస్తుతం అనుకుంటున్న పెట్టుబడులను రెట్టింపు చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెంచడంతోపాటు ఆశిస్తున్న వృద్ధి రేటు, లాభాలను కూడా రెట్టింపు చేసుకునేలా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

2లో..

48 ప్రతిపాదనలకు ఆమోదం.. తుపాను బాధితులకు భరోసా!

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ అత్యవసర సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి , విపత్తు ఉపశమన చర్యలకు సంబంధించి ఏకంగా 48 కీలక ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. తుపాను సహాయక చర్యల్లో మంత్రులు తమ తమ జిల్లాల్లో

2లో..

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎన్ని గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. బీజేపీ అబ్బ అయిన ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే బీజేపీని ఓడించి, బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దింపాం" అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారణాసి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లలో బీజేపీ ఓటమిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై 3,271 ఓట్ల తేడాతో విజయం సాధించారని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. బీజేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన

2లో..

కేంద్రం నిధులు తీసుకురాకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- ఎంపీ ఈటల సవాల్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తన ఆందోళనను ఉద్ధృతం చేశారు. డంపింగ్ యార్డ్ తరలింపునకు తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తే.. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. ఒకవేళ నిధులు

2లో..

నామినేషన్ల దశలోనే ఎన్నడూ చూడనివి చూశాం

- ఇక ఏకగ్రీవాల వెనుక దారుణాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మరొకసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నడూ చూడని దారుణాలు జరిగాయని ఆయన మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో పోలీసుల అండదండలతో అభ్యర్థులపై దాడులకు తెగబడ్డారని, అక్రమాలకు పాల్పడి ఏకగ్రీవాల పేరుతో గెలిచామని చెప్పుకోవడం అధికార పార్టీకే చెల్లిందని విమర్శించారు. పోలింగ్ సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ

2లో..

ధరల భారం.. ప్రజాగ్రహం

అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు అదుపు తప్పితే వాటి ద్వారా లభించే ప్రయోజనం తగ్గిపోతుంది. ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా, రోజువారీ జీవన వ్యయాన్ని భరించడం కష్టమవుతోందనే భావన ప్రజల్లో బలపడితే అది పాలకపక్షాలకు రాజకీయంగా ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో ధరల పెరుగుదల ప్రభావం ప్రభుత్వాలపై అసంతృప్తిని పెంచే అంశంగా మారవచ్చు.

ధరల నియంత్రణే కీలక అజెండా

నిత్యావసరాల ధరలను అదుపులో ఉంచడం, సరుకుల కొరత ఏర్పడకుండా చూడటం, అవసరమైనప్పుడు సరఫరాలను పెంచడం ఇప్పుడు రెండు రాష్ట్ర ప్రభుత్వాల ముందున్న కీలక సవాళ్లు. బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతర నిఘా, అక్రమ నిల్వల నియంత్రణ, సరుకుల లభ్యతపై ముందస్తు అంచనాలు, అవసరమైన సరఫరా చర్యలు ప్రజలకు ఊరట కల్పించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. ధరల పెరుగుదల సమస్యను కేవలం పరిపాలనాపరమైన అంశంగా కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు, ప్రభుత్వాలపై విశ్వాసం, రాజకీయ భవిష్యత్తుతో ముడిపడిన అంశంగా పాలకులు పరిగణించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మొత్తంగా, నిత్యావసరాల ధరల మంటను తగ్గించేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు సామాన్యుల కుటుంబ బడ్జెట్‌కు ఎంతమేర ఉపశమనం కల్పిస్తాయన్నది కీలకం. అదే సమయంలో ఈ చర్యలు ప్రజల్లో ప్రభుత్వాల పట్ల సానుకూలతను నిలబెట్టడంలో ఎంతవరకు ఫలిస్తాయన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

బాధితులకు బ్యాంకులే పరిహారం చెల్లించాలి

ఈ ప్రాథమిక విషయం కూడా వాళ్లకు అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు చేస్తారేమోనని భయమెందుకు?" అని సీజేఐ ప్రశ్నించారు."మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు పోతుంది కదా? మనుషుల్లో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్‌లో అరెస్ట్ అవ్వడమేంటి?" అని సీజేఐ వ్యాఖ్యానించారు. "ఈ వయస్సులో మీరు డిజిటల్‌గా అరెస్ట్ అయితే రాబోయే తరానికి ఏం పాఠాలు నేర్పుతారు? అసలు నిజంగా కోర్టు ఉత్తర్వులు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు కదా?" అని ప్రధాన న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గతవారం ఓ మహిళ డిజిటల్ అరెస్ట్ మోసంతో రూ.2.5 కోట్లు పోగొట్టుకున్న విషయాన్ని అమికస్ క్యూరీ ఎన్.ఎస్. నప్పినాయ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. డిజిటల్ అరెస్ట్ మోసాల బారిన పడుతున్న బాధితులకు బ్యాంకులు రక్షణ కవచంగా నిలవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రిటైర్డ్ వ్యక్తుల ఖాతాల నుంచి అనూహ్యంగా పెద్ద మొత్తంలో నగదు డ్రా అవుతుంటే బ్యాంకులు సకాలంలో ఎందుకు స్పందించి నిరోధించడం లేదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ప్రశ్నించింది. బ్యాంకులు సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోవడం వల్ల మోసం జరిగిందని విచారణ తేలితే, ఆ బాధితుడికి జరిగిన నష్ట పరిహారాన్ని పూర్తి స్థాయిలో సదరు బ్యాంకే చెల్లించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, సంబంధిత బ్యాంకులపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

మండిపడ్డారు.

పొద్దున్నే మా ఆవిడ చెప్పిన విజయవాడ స్టోరీ

హైదరాబాద్‌లోనే కాదు, పొరుగు రాష్ట్రాల్లోనూ నీటి కొరత ఏ స్థాయిలో ఉందో వివరించేందుకు కేటీఆర్ ఒక ఉదాహరణ చెప్పారు. "ఉదయం మా ఆవిడ నాతో ఒక విషయం చెప్పింది. మా ఇంటి ఎదురుగా నివసించే వ్యక్తికి విజయవాడ నుంచి వారి బంధువులు ఫోన్ చేశారు. విజయవాడలో కనీసం తాగడానికి, వాడుకోవడానికి కూడా నీళ్లు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీళ్ల కోసం హైదరాబాద్‌కే వచ్చేస్తామని వారు అన్నారట. విజయవాడ లాంటి ప్రదేశం నుంచే హైదరాబాద్‌కు రావలసి వస్తోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

చంద్రబాబు దూరదృష్టిని అభినందిస్తున్నా

కరవు పరిస్థితులు ఎదురైనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి నిర్వహణను సమర్థవంతంగా చేపడుతున్న తీరుపై ఏపీ సీఎం చంద్రబాబును కేటీఆర్ అభినందించారు.

ఏపీలో ఎత్తిపోతల పథకాల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు అందించడంలో చంద్రబాబు దూరదృష్టితో వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

వర్షపాతం లోటు ఉన్నా తెలంగాణలోనే కరవు

దక్షిణాది రాష్ట్రాల్లో నమోదైన వర్షపాతం గణాంకాలను కేటీఆర్ పోల్చి చెప్పారు. ఏపీలో సుమారు 35%, కర్ణాటకలో 30% వర్షపాతం లోటు నమోదైనప్పటికీ, సరైన నీటి యాజమాన్యం వల్ల అక్కడ కరవు పరిస్థితులు రాకుండా చూసుకోగలిగారు. కానీ, తెలంగాణలో కేవలం 17% నుండి 25% లోటు మాత్రమే ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇక్కడ కరవు ప్రకటించాల్సిన దుస్థితికి తెచ్చింది. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ద్వారా వేసవిలోనూ ఎక్కడా నీటి కొరత లేకుండా చూసుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేక పంట పొలాలను ఎండబెడుతోందని కేటీఆర్ విమర్శించారు. నీరు అందక ఎండిపోయిన పంటలకు తక్షణమే ఎకరాకు రూ.20,000 చొప్పున పరిహారం అందించాలని, తాగునీటి సరఫరాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేవంత్ రుద్దుతున్న కరవు

"ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్, ఇప్పుడేమో రైతుల సెల్ఫ్ డిక్లరేషన్. తమ పంటలు తామే కాపాడుకుంటామని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన దుస్థితి నేడు తెలంగాణలో ఏర్పడింది. జెనరేటర్లు, ట్యాంకర్లతో తెలంగాణ రైతులు పంటలు కాపాడుకుంటున్నారు. క్రాప్ హాలిడే ప్రకటించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే హాలిడే ఇవ్వాలి.

ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు, రేవంత్ రెడ్డి మనపై రుద్దుతున్న కరవు. 4 నెలల ముందే మేమంతా హెచ్చరించినా వినకుండా గోదావరిలోని 750 టీఎంసీలు, కృష్ణాలోని 250 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలేసి, కరవుకు కారణమయ్యిండు. రాష్ట్రంలో ఒకవైపు ప్రభుత్వం కరవు ఉందని చెబుతూనే, మరోవైపు మూసీ సుందరీకరణ చేస్తాడట. మూసీ ప్రాజెక్ట్ బాధితుల కోసం పబ్లిక్ హియరింగ్ పెడితే బీఆర్ఎస్ మాజీ మంత్రులను, ఎమ్మెల్యేలను, నాయకులను హౌస్ అరెస్ట్ చేశారన్నారు కేటీఆర్.

కొండా సురేఖ క్షమాపణలపై స్పందించిన కేటీఆర్

మాజీ మంత్రి కొండా సురేఖ గతంలో కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. ఈ విషయంపై కేటీఆర్ స్పందించారు. "నిజం నిలకడ మీదే తేలుతుంది. మొన్న ఒక వార్తాపత్రిక క్షమాపణ చెప్పింది, నేడు ఈ మేడం చెప్పారు. ఇంకా క్షమాపణలు చెప్పే వాళ్లు చాలా మంది ముందు వరుసలో ఉన్నారు. మా మీద ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేసే వారు భవిష్యత్తులో వరుసగా క్షమాపణలు చెప్తారు" అని కేటీఆర్ అన్నారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం

నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు.వారణాసిలో ఓటమి మోదీ పాలనపై ప్రజా వ్యతిరేకతను సూచిస్తోందని, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఈ ఫలితాలపై మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని, గత 12 ఏళ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించని ప్రధాని కేవలం ట్వీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.

కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వ వ్యతిరేకత అనే బీజేపీ, వారణాసిలో ఓటమిని ఎందుకు మోదీకి వ్యతిరేకంగా చూడదని ప్రశ్నించారు. లక్నో నుంచి పట్నా వరకు బీజేపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత ప్రాంతమైన గోరఖ్‌పూర్‌లో కేవలం 307 ఓట్ల మెజారిటీతో గెలవడమే దీనికి నిదర్శనమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మూడంకెల సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీయేతర శక్తులకు ప్రజా మద్దతు పెరుగుతోందని, ఆయనే తదుపరి ప్రధాని అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఓట్ల దొంగతనం'ను నిరసిస్తూ నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నామని, జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో పెట్టుబడులకు నా భరోసా!

రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ దేశాల దౌత్య ప్రతినిధులు, సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు నేనున్నా

పెట్టుబడులకు భద్రత కల్పించడం, పరిశ్రమలు వృద్ధి చెందేలా చూడటం తన వ్యక్తిగత బాధ్యతగా భావిస్తున్నానని రేవంత్‌రెడ్డి చెప్పారు. పెట్టుబడిదారులకు తాను సంరక్షకుడిగా ఉంటానని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యాపార రంగంలో పారిశ్రామికవేత్తలకే ఎక్కువ అనుభవం ఉంటుందని పేర్కొన్న ఆయన వారి అభిప్రాయాలను వినడం, సూచనలను అర్థం చేసుకోవడం, వాటిని ఆచరణలో పెట్టడం ప్రభుత్వ బాధ్యత అని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడే మంచి విధానపరమైన సూచనలు అందించాలని, వాటిని పరిశీలించి తగిన మేరకు ప్రభుత్వ విధానాల్లో అమలు చేస్తామని తెలిపారు.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్–2047' లక్ష్యానికి అనుగుణంగా 'తెలంగాణ రైజింగ్–2047' భవిష్యత్ ప్రణాళికను రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరితే అందులో తెలంగాణ వాటా 10 శాతంగా, అంటే మూడు ట్రిలియన్ డాలర్లుగా ఉండాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా సుమారు ఐదు శాతంగా ఉందని పేర్కొన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యాల సాధనకు పెట్టుబడులు, పారిశ్రామిక విస్తరణ, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు.

కేంద్రంతో కలిసి అభివృద్ధి పథంలో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో మూడు హైదరాబాద్‌కు అనుసంధానం కానున్నాయని వివరించారు. హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె మార్గాల్లో ఈ కారిడార్లు ప్రతిపాదితమయ్యాయని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణం సహా పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా కేంద్రం తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తోందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, నేవీ రాడార్ కేంద్రం తదితర ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంతో కలిసి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. రవాణా సదుపాయాల విస్తరణతో పరిశ్రమలకు అనుసంధానం మెరుగుపడటమే కాకుండా పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి

హైదరాబాద్ చారిత్రక వైభవం, మౌలిక సదుపాయాలు, మేధోసంపత్తి, సాంకేతిక నైపుణ్యాలను ప్రస్తావించిన సీఎం నగరం ప్రపంచస్థాయి పెట్టుబడుల కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో హైదరాబాద్ పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక అవకాశాలను మరింత విస్తరించి, కొత్త రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

పెట్టుబడులకు కీలక వేదికగా గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుకు కీలక వేదికగా నిలవనుంది. పెట్టుబడిదారులు, అంతర్జాతీయ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాలు, పారిశ్రామిక అవకాశాలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ సదస్సులో పాల్గొని తెలంగాణ అభివృద్ధికి తమ ఆలోచనలు, పెట్టుబడులతో సహకరించాలని సీఎం పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

48 ప్రతిపాదనలకు ఆమోదం..

తుపాను బాధితులకు భరోసా!

నిమగ్నమై ఉండటంతో ఈ సమావేశాన్ని ప్రత్యేకంగా వర్చువల్ విధానంలో నిర్వహించారు. విపత్తు సమయంలో బాధితులను ఆదుకోవడంతో పాటు, రాష్ట్రంలోకి భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు, విధానపరమైన నిర్ణయాలకు ఈ భేటీలో పచ్చజెండా ఊపారు. సమావేశంలో ప్రధానంగా ఆర్నాబ్ తుపాను సృష్టించిన బీభత్సం, ప్రాథమిక నష్టం, సహాయక చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని చివరి బాధితుడికి కూడా నష్టపరిహారం సమర్థవంతంగా చేరేలా చూడాలని, ఏ ఒక్కరూ నష్టపోకూడదని సీఎం స్పష్టం చేశారు. వరదలు, ఈదురుగాలుల వల్ల నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారంతో పాటు నివాసాలు, చిన్న వ్యాపారాలు మరియు జీవనోపాధి దెబ్బతిన్న కుటుంబాలకు పారదర్శకంగా తక్షణ ఆర్థిక సాయం అందించేలా వేగవంతమైన చర్యలు చేపట్టాలని మంత్రులను, అధికారులను ఆదేశించారు.పరిశ్రమలు, డిజిటల్ మౌలిక వసతుల రంగానికి కేబినెట్ పెద్దపీట వేసింది. ఉత్తరాంధ్రలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు తీయించేలా విజయనగరం జిల్లాలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అంతేకాకుండా, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల్లో సెమీకండక్టర్ రంగానికి ఊతమిచ్చేలా 91.10 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సిలికాన్ వేఫర్ తయారీ కేంద్రం స్థాపనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు విశాఖపట్నాన్ని గ్లోబల్ ఐటీ డిజిటల్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రతిష్టాత్మక హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ప్రాజెక్టుకు అవసరమైన భూకేటాయింపుల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ భేటీ సందర్భంగా మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రీ–ప్లాంటేషన్, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీరు, పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల వేళ ప్రజలకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నిలవాలి. యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉండి సాధారణ పరిస్థితులు తెచ్చే వరకు పర్యవేక్షించాలి అని ఆదేశించారు. సాంకేతికతను ఉపయోగించి వేగంగా, పారదర్శకంగా పంట నష్ట గణాంకాలను నమోదు చేయాలని సూచించారు.

నామినేషన్ల దశలోనే ఎన్నడూ చూడనివి చూశాం

జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో–ఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రిటర్నింగ్ అధికారులపై ఫైర్

నామినేషన్ల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు పూర్తిగా చంద్రబాబునాయుడుకు అనుకూలంగా పని చేశారని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. నామినేషన్ కేంద్రాలను ఆక్రమించడం, పత్రాలను చించివేయడం, బీ–ఫారాలను మాయం చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడ్డారని జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. అలాగే ఓసీలకు ఏకంగా బీసీ సర్టిఫికెట్లు ఇచ్చి అక్రమాలకు తెర తీశారన్నారు.

పోలింగ్, కౌంటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

పోలింగ్, కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వైఎస్ జగన్ కార్యకర్తలకు సూచించారు. నామినేషన్ల సమయంలోనే ఇన్ని దారుణాలకు పాల్పడిన వారు, పోలింగ్ రోజున రిగ్గింగ్‌కు, స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సుల మార్పిడికి ఏ మాత్రం వెనకడుగు వేయరని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పోలింగ్ ఏజెంట్లు అనుసరించాల్సిన విధానంపై సరైన ప్లానింగ్ ఇవ్వాలని, విధులను సమర్థవంతంగా నిర్వర్తించేలా వారిని సన్నద్ధం చేయాలని నేతలను ఆదేశించారు.

వీడియో ఆధారాలు సేకరించాలి

ఎన్నికల ప్రక్రియలో ఎక్కడైనా తప్పులు, పొరపాట్లు జరిగినా ఆధారాలు, వీడియోలు సేకరించడం అత్యంత కీలకమని వైఎస్ జగన్ తెలిపారు. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, సీసీ కెమెరాలు పెట్టడంపై అనుమానాలున్నాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం దగ్గర తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని, ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే లీగల్ సెల్ ద్వారా పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా స్థానకంగా ఓటర్లకు అండగా ఉండి.. వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పేదల బియ్యంపై దోపిడీ దందా!

అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కర్మన్ ఘాట్ పరిసరాల్లోని ప్రముఖ రైస్ డిపోలు, గోదాములపై ఉన్నతాధికారులు దాడులు చేశారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సంచులు, కల్తీ ప్రాసెసింగ్ యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. రేషన్ లబ్ధిదారుల నుంచి లేదా రేషన్ డీలర్ల నుంచి అతి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని మాఫియా ఏజెంట్లు సేకరిస్తారు. ఇలా సేకరించిన లావు బియ్యాన్ని రైస్ మిల్లులు, డిపోల్లో ప్రత్యేక యంత్రాల ద్వారా పాలిష్ పట్టిస్తారు. దీనివల్ల బియ్యం తెల్లగా, సన్న బియ్యం మాదిరిగా కనిపిస్తాయి. రీసైకిల్ చేసిన ఈ బియ్యాన్ని ప్రముఖ, పేరుగాంచిన బ్రాండెడ్ కంపెనీల కవర్లు, డూప్లికేట్ బ్యాగుల్లో ప్యాక్ చేస్తారు. మార్కెట్లో ఈ కల్తీ బియ్యాన్ని కిలో రూ. 80 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తూ వినియోగదారులను దారుణంగా మోసం చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పదే పదే పాలిష్ చేయడం ద్వారా వాటిలో ఉండాల్సిన పోషకాలు కోల్పోతాయి. ప్రాసెసింగ్ సమయంలో వాడే రసాయనాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేషన్ అక్రమ తరలింపునకు సహకరిస్తున్న డీలర్లు, మిల్లుల యజమానులు, దళారులపై పి.డి. యాక్ట్ కింద కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా బయోమెట్రిక్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ తెలిపింది.

తుఫాను తాండవం.. 4600 కోట్ల గాయం

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ చర్యలను, భవిష్యత్ ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు.

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించాం

గతంలో 1977 దివిసీమ తుపాను, 1996 కోనసీమ తుపాను సృష్టించిన విధ్వంసాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, ఆ అనుభవాలతో ఈసారి పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "ఈసారి ఒకే ఒక్క టార్గెట్ పెట్టుకున్నాను, ప్రాణనష్టం సున్నాగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దురదృష్టవశాత్తు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. టెక్నాలజీని ఉపయోగించి తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. రాత్రంతా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ విభాగాలను మోహరించాం. ఏ ప్రాంతంలో ఎంత తీవ్రత ఉంటుందో నిమిష నిమిషానికి సమాచారం అందించాం. దీనివల్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం" అని ఆయన వివరించారు. కొంతమంది తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారని, కానీ తీవ్రత పెరిగాక వాస్తవం గ్రహించారని అన్నారు.

30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు కళ్లముందు

ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం 1996లో వచ్చిన తుఫాను నాటి భయానక పరిస్థితులను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు నా కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతున్నాయి. అప్పుడు ప్రైవేట్ ఫ్లైట్స్ లేవు, డిఫెన్స్ విమానంలో వచ్చాను. ఆర్మీ హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాపాయం ఉంటుందని నన్ను తీసుకెళ్లలేమని చెప్పినా, నేను బలవంతం చేసి వెళ్లాను. రోడ్డు మీద దిగి మత్స్యకార గ్రామాలను చూస్తే భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. ముమ్మిడివరం, అమలాపురంలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పి, రాజమండ్రి ఆర్డీవో ఆఫీసునే సెక్రటేరియట్‌గా మార్చి, ప్రతి మండలానికి ఒక సెక్రటరీని నియమించి వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చాం. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు టెక్నాలజీ సాయంతో వేగంగా స్పందించగలుగుతున్నాం" అని ఆయన తెలిపారు.

వెయ్యి మందిని పంపమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాను

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు దెబ్బతింటాయని అంచనా వేయగా, ఒక్క కోనసీమలోనే 8,000 స్తంభాలు నేలకూలాయని చంద్రబాబు తెలిపారు. "తుపాను తీరం దాటిన వెంటనే చెట్లను తొలగించే పనులు ప్రారంభించాం. ఈరోజు మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు క్లియర్ చేశాం. విద్యుత్ పునరుద్ధరణే ఇప్పుడు మా ముందున్న ప్రధాన సవాలు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి 1000 మంది సిబ్బందిని పంపమని కోరాను. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అదనపు సిబ్బందిని తెప్పిస్తాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికి 100% విద్యుత్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు. టెలికమ్యూనికేషన్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్ సిద్ధం చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించినా, కొందరు నిర్లక్ష్యం చేశారని, వారికి అవసరమైతే ప్రభుత్వమే డీజిల్ ఖర్చులు భరిస్తుందని చెప్పామని అన్నారు.

నష్టపరిహారంపై స్పష్టమైన హామీ

తుపాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. "కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాను. ఆయన స్వయంగా ఫోన్ చేసి శుక్రవారం కేంద్ర బృందాన్ని పంపిస్తానని చెప్పారు. ప్రాథమిక నష్టాల నివేదికను కేంద్రానికి పంపాం. కేంద్ర బృందం పర్యటన తర్వాత పూర్తిస్థాయి నివేదిక అందించి సహాయం కోరతాం" అని తెలిపారు.బాధితులకు అందించే పరిహారంపై స్పష్టత ఇస్తూ, "కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్టుకు రూ. 1,500 చొప్పున పరిహారం అందిస్తాం. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసరాలతో కూడిన ప్యాకేజీతో పాటు కొంత నగదు కూడా అందిస్తాం. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టం జరగకుండా ఆదుకుంటాం. ఈసారి పంటలకు బీమా కూడా చేయించాం కాబట్టి దిగుబడి తగ్గినా పరిహారం అందుతుంది" అని భరోసా ఇచ్చారు.విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, ఎన్నికలకు, సహాయక చర్యలకు సంబంధం లేదని, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. గత 'మొంథా' తుపాను పరిహారంపై మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిందని, ఈసారి కూడా పక్కాగా అంచనాలు వేసి త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తుఫానులను తట్టుకునేలా కోస్తా తీరంలోని కీలక ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని చంద్రబాబు వెల్లడించారు.

కేంద్రం నిధులు తీసుకురాకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా

మంజూరు చేయించడంలో విఫలమైతే రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని సవాల్ విసిరారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆయన చేపట్టిన 'జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర' గురువారం మూడో రోజుకు చేరింది.జవహర్‌నగర్‌లోని చెత్త డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ కోరారు. ముందుగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనగలమనే నమ్మకంతోనే ప్రజల్లోకి వచ్చానని ఆయన పేర్కొన్నారు. కీసర నుంచి ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా గురువారం స్థానికులు ఈటల రాజేందర్‌కు స్వాగతం పలికారు.కీసరలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు.

అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఆరుగురు ముఖ్యమంత్రులతో వివిధ అంశాలపై పోరాడినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న కలుషిత ద్రవ వ్యర్థాలు స్థానిక చెరువులు, భూగర్భ జలాలను ప్రభావితం చేస్తున్నాయని ఈటల రాజేందర్ ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల నుంచి ఆకుపచ్చ రంగులో నీరు వస్తోందని పేర్కొంటూ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థ పనితీరుపైనా ఆయన విమర్శలు చేశారు. డంపింగ్ యార్డ్ సమస్యను కేవలం ఖర్చు కోణంలో చూడకూడదని ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలే ప్రధానమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తే చెత్తను రీసైక్లింగ్ ద్వారా విలువైన వనరులుగా మార్చవచ్చని పేర్కొన్నారు.

వ్యర్థాల నిర్వహణలో సమర్థవంతమైన పద్ధతులు అవలంబించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఈటల రాజేందర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లక్షల కోట్ల రూపాయల వ్యయంతో మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తుండగా.. సుమారు రూ.2 వేల కోట్లతో పరిష్కరించవచ్చని తాను అంచనా వేస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ఎంపీ ఈటల ప్రశ్నించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించే వరకు తన ఆందోళన ఆగదని ఈటల రాజేందర్ మరోసారి తేల్చి చెప్పారు. ఈ డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు శుక్రవారం జవహర్‌నగర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ సభకు బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని కాషాయ వర్గాలు చెబుతున్నాయి.

తిరుమలకు నీటి గండం గుబులు

150 రోజుల నిల్వలే దిక్కు.. వర్షాలు ముఖం చాటేస్తే దిక్కేది..

రోజుకు 50 లక్షల గ్యాలన్ల వినియోగం..

వేసవి ముప్పుపై టీటీడీ ముందస్తు కసరత్తు..

కళ్యాణి డ్యామ్‌పై ఆశలు..

ప్రత్యామ్నాయ జల ప్రణాళికలు కార్యరూపం దాల్చేదెప్పుడు..

తిరుమల(ప్రశ్న న్యూస్) కొండపై భక్తుల రద్దీకి కొదవలేదు.. నిత్యం స్వామివారి దర్శనానికి లక్షలాది మంది వస్తుంటారు. కానీ ఇంతటి భారీ అవసరాలకు నీటి భరోసా ఎన్ని రోజులు? ప్రస్తుతం 150 రోజులకే సరిపడా నిల్వలు ఉన్నాయని టీటీడీ చెబుతుండటంతో భవిష్యత్తు జల భద్రతపై చర్చ మొదలైంది. నవంబర్, డిసెంబర్ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిస్తే సరే.. లేకుంటే వచ్చే వేసవిలో నీటి సరఫరా పరిస్థితి ఏమిటి? ఇదే ఇప్పుడు కీలక ప్రశ్న

రోజుకు 50 లక్షల గ్యాలన్లు.. ఆగని అవసరం..

తిరుమలలో రోజువారీ నీటి అవసరం సుమారు 50 లక్షల గ్యాలన్లు. ఇందులో సగం టీటీడీ సొంత డ్యామ్‌ల నుంచి, మిగిలిన సగం కళ్యాణి డ్యామ్ నుంచి సరఫరా అవుతోంది. తాగునీరు, కాటేజీలు, పారిశుధ్యం సహా అనేక అవసరాలకు నీరే ఆధారం. భక్తుల రద్దీ పెరిగే రోజుల్లో ఈ అవసరాల నిర్వహణ మరింత కీలకం.ప్రస్తుతం 150 రోజులకు సరిపడా నిల్వలున్నాయని అధికారులు ప్రకటించారు. అయితే ఈ లెక్కలు ప్రస్తుత వినియోగం ఆధారంగానా? భక్తుల రద్దీ పెరిగితే నిల్వలు ఎన్ని రోజులు వస్తాయి? వర్షాలు ఆలస్యమైతే పరిస్థితి ఎలా ఉంటుంది? అన్న అంశాలపై సమగ్ర వివరాలు వెలువడాల్సి ఉంది.

వర్షాలే దిక్కా.. ప్రత్యామ్నాయాల సంగతేంటి..

నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసే వర్షాలతో డ్యామ్‌లు నిండుతాయని టీటీడీ ఆశిస్తోంది. అన్ని జలాశయాలు పూర్తిస్థాయిలో నిండితే సుమారు ఏడాదిన్నర పాటు నీటి ఎద్దడి ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ వర్షాలు ప్రకృతి చేతిలో ఉన్నాయి.. నీటి భద్రత మాత్రం ప్రణాళికలతోనే సాధ్యం. అందుకే వర్షాలపై ఆశలు పెట్టుకోవడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది.వర్షాలు కురవని పరిస్థితి ఎదురైతే చేపట్టాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేయాలని అధికారులను టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కళ్యాణి డ్యామ్ లేదా ఇతర మార్గాల ద్వారా నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. టీటీడీ డ్యామ్‌ల పరిశీలనలో బోర్డు సభ్యులు నరేష్ కుమార్, శాంతారామ్, ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ సుధాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కారులో మంటలు ఒకరు మృతి..

గుంటూరు ఇందిరా ప్రియదర్శిని కాలనీ సాయి బాబా దేవాలయం వద్ద ఘటన..మారుతి బ్యాలీనో కారులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు..కారు లో ఇద్దరు వ్యక్తులు వకరు తప్పించుకోగా మరొకరు కారులోనే అగ్నికి ఆహుతి..మృతుడు తాడికొండ హరికృష్ణ 53 గా గుర్తించిన లాలపేట పోలీసులు..గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలింపు..మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది..

పాస్ పోస్టు జప్తు వార్తలు ఆవాస్తవం

- కేటీఆర్ న్యాయవాదులు

హైదరాబాద్ కేటీఆర్ పాస్పోర్ట్ సీజ్ చేశారని పత్రికల్లో వస్తున్న వార్తలు అవాస్తవని న్యాయవాదులు అంటున్నారు.ఏసీబీ అధికారులు పాస్పోర్ట్ ప్రొటెక్షన్ కావాలని మెమో మాత్రమే ఫైల్ చేశారు. కేటీఆర్ కౌన్సిల్ తరపున మాకు ఇంకా నోటీసులు కూడా రాలేదు. నోటీసులు వచ్చాక కౌంటర్ ఫైల్ చేసి మా వాదనలు వినిపిస్తాం. ఆ తర్వాత కోర్టు పాస్పోర్ట్ను ప్రొడ్యూస్ చేయమని చెప్పొచ్చు లేదా ఆ పిటిషన్ను డిస్మిస్ చేయొచ్చు. ఆ కోర్టు ఆదేశాలు రాకముందే కేటీఆర్ పాస్పోర్ట్ను ప్రొటెక్ట్ చేయమని ఏసీబీ అధికారులు చెప్పారని పత్రికల్లో అవాస్తవాలు రాస్తున్నరని - అడ్వకేట్ జక్కుల లక్ష్మణ్ వివరణ ఇచ్చారు.

మండల వ్యాప్తంగా విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు పూర్తి

- 63 పాఠశాలలకు నూతన విద్యా కమిటీలు,2 చోట్ల వాయిదా.

- మండల విద్యాధికారులు ప్రవీణ, రమా వెంకటేశ్వర్లు.

తుగ్గలి: తుగ్గలి మండల వ్యాప్తంగా మంగళవారం రోజు నిర్వహించిన విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ముగిశాయని మండల విద్యాధికారులు ప్రవీణ, రమా వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతుగ్గలి మండలంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని వారు తెలియజేశారు.మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో మండలంలోని మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలల్లోఎంపీపీఎస్,ఎంపియుపిస్, జడ్.పి.హెచ్.ఎస్,కేజీబీవీ,ఆశ్రమ పాఠశాలలో ఎన్నికల ప్రక్రియ చేపట్టగా,63 పాఠశాలల్లో నూతన చైర్మన్లు,వైస్ చైర్మన్ల ఎన్నికలు పూర్తయ్యాయని వారు తెలియజేశారు.మండల పరిధిలోని గల రామాపురం ఎంపియుపిఎస్ పాఠశాల యందు రాజకీయ సమస్య కారణంగా,ముక్కెళ్ల జడ్పీ హైస్కూల్ నందు కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు వారు తెలియజేశారు. వాయిదా పడిన రెండు పాఠశాలల్లో త్వరలోనే తిరిగి ఎన్నికలు నిర్వహించి పూర్తి చేస్తామని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.విద్యా కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ లుగా ఎన్నికైన సభ్యులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,నాయకులు ఘనంగా సన్మానించారు.ఎన్నికైన నూతన కమిటీలు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ,మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించనున్నాయి.ఈ కార్యక్రమంలో నాయకులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల

విద్యా కమిటీ చైర్మన్ ఏకగ్రీవం

చాగలమర్రి చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్ గా కసినేని ఓబులేసు, ఉపాధ్యక్షులుగా అమీర్, సభ్యులుగా కింగ్ హుస్సేన్, నూరి, రమణ, లక్ష్మీనారాయణ రెడ్డి, గౌసియా, అంజనమ్మ, శారద, జ్యోతి, గంగాదేవి తదితరులు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా చైర్మన్ గా ఎన్నికైన కసినేని ఓబులేసు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అన్ని రకాలుగా తాను కృషి చేస్తానని , ఈ అవకాశం కల్పించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు , నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, చాగలమర్రి టిడిపి పట్టణ అధ్యక్షులు మౌలాలి, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, టైలర్ భాష, సయ్యద్ బషీర్, బాల దస్తగిరి, పీరయ్య, కింగ్ హుస్సేన్, కలాంబిడి బషీర్, దస్తగిరి, సుద్ధపల్లి వలి, మోహన్, సురేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన మాజీ మంత్రి.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

వనపర్తి.స్వయంగా ఓటు నమోదుకు శ్రీకారం చుట్టిన గనిరంజన్ రెడ్డి.హైదరాబాద్, రంగారెడ్డి,మహబూబ్ నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను తన స్వగృహంలో ప్రారంభించారు.తనతో పాటు గ్రాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన కల్పించి స్వయంగా ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైందని బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని,నవంబర్ 2023 వరకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అర్హులు అవుతారని కాబట్టి ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి,ప్రజాస్వామ్య మనుగడకు ఏకైక ఆయుధమని కాబట్టి విజ్ఞులు గ్రాడ్యుయేట్ ఎన్నికలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఓటు నమోదు చేసుకున్న వారిలో నందిమల్ల.అశోక్, కౌన్సిలర్.శ్రీకర్ గౌడ్,పలుస.శంకర్ గౌడ్,వెంకట్ సాగర్, ఉంగ్లం. తిరుమల్,సూర్యవంశం .గిరి, జోహెబ్ హుస్సేన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి.శ్రీధర్, కె.మాణిక్యం,ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి,దేవర్ల.నరసింహ,నీలస్వామి, మంద.రాము ఉన్నారు.

పేట హై స్కూల్‌లో పూర్వ విద్యార్థుల తరఫున ప్రతినిధిగా స్టార్ కృష్ణ!.

ఏర్పేడు ఏర్పేడు మండలం, పాపానాయుడు హై స్కూల్ లో ఈ రోజు అనగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారయ్య అధ్యక్షతన జరిగిన ఎస్ఎంసి ఎన్నికలలో పూర్వ విద్యార్థుల తరఫున ప్రతినిధిగా (సభ్యునిగా) అంబేడ్కర్ స్టార్ కృష్ణ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.కమిటీ చైర్మన్ గా రోశయ్య వైస్ చైర్మన్ గా షామి లను, మరో పదమూడు మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన కమిటీ చిత్త శుద్ధిగా పనిచేస్తుందని తెలిపారు. అంతేకాకుండా పూర్వ విద్యార్థులను అందరినీ ఏకంచేసి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణప్ప మొదలి, అర్జున్ బాబు, రవి, దొరవేలు, కృష్ణయ్య, టీచర్లు ప్రసాద్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి డ్రైనేజీ నీరు..

- వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు

- కాలువను శుభ్రం చేసిన సిబ్బంది..

- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి

తిరుపతి న్యూఇందిరానగర్ ప్రాంతంలోని సైడ్ కాలువలో మురుగునీరు నిలిచిపోయిన సమస్యపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. సమస్యపై సమాచారం అందిన వెంటనే సంజయ్ గారు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పందించి సిబ్బందిని కాలువను శుభ్రం చేయించారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.అయితే డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మల వ్యర్థాలు కాలువలోకి చేరుతున్న సమస్యకు ప్రస్తుతం చేపట్టిన చర్య తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి కాలువ వైపు వస్తున్న పైపును మళ్లించి, మల వ్యర్థాలు కాలువలోకి రాకుండా ప్రస్తుతం అడ్డుకోవడం జరిగిందని తెలిపారు.మళ్లీ ఇదే సమస్య తలెత్తకుండా డ్రైనేజీ పైప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, మల వ్యర్థాలు కాలువలోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై వెంటనే స్పందించి కాలువను శుభ్రం చేయించిన సంజయ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన సమస్యకు కూడా త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

తుగ్గలి బీసీ కాలనీ ప్రధాన రహదారికు మహర్దశ

- 40 లక్షల సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి.

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని గల బీసీ కాలనీ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, తుగ్గలి మాజీ జెడ్పిటిసి సభ్యురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం రోజున ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు కృషితోనే ఈ సీసీ రోడ్డు మంజూరైందని,కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,రాబోయే రోజుల్లో తుగ్గలి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీసీ కాలనీవాసులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ నివాసులు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోషక ఆహారమే ఆరోగ్యానికి పునాది

బేతంచెర్ల :పోషక ఆహారంతోనేచిన్నారులు,బాలింతలు,గర్భిణీలు,కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని సూపర్వైజర్ అరుణ,పీహెచ్‌సీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి,తెలిపారు.మంగళవారం మండలంలోని అంబాపురం గ్రామంలో అంగన్వాడీ ఉత్సవాలునిర్వహించారు.వారు మాట్లాడుతూ 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ వరకు అంగన్వాడీ ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.మాతృ సంరక్షణ,పోషణ,శిశు అభివృద్ధి,టీకాలు,మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.సమాజ సేవలోఅంగన్వాడీ సెంటర్లు ఎంతో కీలకమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి,అంగన్వాడీ టీచర్లు చందన,రమాదేవి,ఆశా వర్కర్లు పుల్లమ్మ,మహేశ్వరి,పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో ప్రతాపం చూపిన 11 మంది రెయిన్‌బో విద్యార్థులు

రేణిగుంట అన్నమయ్య జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ సబ్-జూనియర్ ఇంటర్-డిస్ట్రిక్ట్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-12, అండర్-14 విభాగాల్లో విశేష ప్రతిభ చాటిన 11 మంది విద్యార్థులు నేషనల్స్ కు అర్హత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.?జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ?బాలికల విభాగం దీప్తి హనీ కె. (8వ తరగతి), కీర్తి కె. (8వ తరగతి), కారుణ్య ఎస్. (7వ తరగతి), దీపాన్విత కె. (8వ తరగతి), ప్రణవి కె. (8వ తరగతి), జ్ఞాపిక ఎన్. (7వ తరగతి).?బాలుర విభాగం..కె.ఎం.డి. రిహాన్ (9వ తరగతి), దీక్షిత్ కుమార్ (8వ తరగతి), ఎస్. ముస్తఫా (7వ తరగతి), ఎండి. ఖదీర్ (8వ తరగతి), బి. ఎస్లినక్షత్ర (8వ తరగతి).?ఈ జాతీయ స్థాయి పోటీలు మహారాష్ట్రలోని నాందేడ్ లో అక్టోబర్ 29 నుండి నవంబర్ ఒకటో 1 వరకు జరగనున్నాయి.?ఈ సందర్భంగా రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరెస్పాండెంట్ శ్రీ పి.ఎ. ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులను అంకితభావంతో తీర్చిదిద్దిన కోచ్ రెడ్డి కుమార్ కి, విద్యార్థుల క్రీడా ప్రతిభను నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లోనూ తమ విద్యార్థులు పాల్గొని మెడల్స్ సాధిస్తారని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నామమును సగర్వంగా నిలబెడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బేతంచెర్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

మంగళవారం బేతంచెర్ల మండల పరిధిలోని ఎంబాయి,బైనపల్లె, శంకలాపురం,మండ్లవానిపల్లె, సీతారామపురం,గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోట్ల శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోరహదారులు,డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కన్వీనర్,మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ ఎల్ల నాగయ్య,ఎంపీడీవో ఫజల్ రహిమాన్,డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున పంచాయతీరాజ్ ఇంజనీర్ మహేష్,ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి,ఈశ్వరప్ప,శివయ్య,శేఖర్,మహేష్, మల్లికార్జున,వెంకట రాముడు,అశ్వత్ నారాయణ,మద్దయ్య,అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలోని ఉన్నటువంటి అని మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా కలెక్టర్ కి రాష్ట్రంలో మెదక్ జిల్లాలో కరువు మండలాలుగా ఏకైక ఒకేమండలంమనోహరాబాద్ మండల్ ప్రకటించడం మెదక్ జిల్లా అన్ని మండలాలు కరుమ కరువు మండలాలుగా ప్రకటించాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు పసల్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పంట ఫసల్ బీమా పథకాన్ని అమలు చేసి ఉంటే ఈ టైం లో రైతుకు భరోసాగా ఉండేదని మైసయ్య యాదవ్ కలెక్టర్ కోరారు కలెక్టర్ కి వివరించారు దాని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఫసల్ బీమా పథకాన్ని రైతుకు భరోసాగా ఉంటాదని కలెక్టర్ వివరించారు నవంబర్ మొదటి వారంలో జిల్లాలో అన్ని మండలాల గ్రామపంచాయతీ వారీగా రైతులకు గ్రామసభలు నిర్వహించాలని మెసేజ్ యాదవ్ కలెక్టర్ కోరారు వరి పంట కాకుండా ఇతర పంటలకు అవగాహన కల్పించాలని ఇతర పంటలు విత్తనాలు సబ్సిల్లో ప్రభుత్వం అందించాలని కలెక్టర్ వివరించారు దానికి కలెక్టర్ సరే అని స్పందించాలి అన్ని గ్రామ పంచాయతీలో అవగాహన సదస్సులు నవంబర్లో ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అన్నారు మెదక్ జిల్లా అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించడానికి రెండో విడతలో మెదక్ జిల్లా కరువు జిల్లాగా ప్రకటించాలని కలెక్టర్ కోరారు ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ జిల్లా ఉపాధ్యక్షులు అంతం గారి వెంకటేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్ కార్యదర్శి చండం నరేందర్ పెద్ద కొల్ల మల్లేష్ ఎల్లం యాదవ్ పరశురాములు నారాయణ రైతులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న లడ్డు అమోఘం

- భక్తులకు ఇష్టంగా మారిన మల్లన్న లడ్డు ప్రసాదం
- గుమగుమాలాడే సువాసనలతో భక్తులను మంత్రముగ్దులను చేస్తున్న లడ్డు ప్రసాదం
- స్వామిఅమ్మవార్లకు నైవేద్యంతో అమృతంగా ఆధ్యాత్మికతకు లడ్డు ప్రసాదం
- మల్లన్న దర్శనం అనంతరం స్వామివారి లడ్డు ప్రసాదం విరివిగ భక్తుల కొనుగోలు
- స్పర్శ దర్శనం టికెట్లు తీసుకున్న ప్రతి భక్తుడికి రెండు లడ్డూలు ఉచ్చితం
- అతి శీఘ్ర దర్శనం టికెట్ తీసుకున్న ప్రతి భక్తుడికి ఒక లడ్డు ఉచ్చితం
- భక్తుల మన్ననలను పొందుతున్న ఈఓ శ్రీనివాసరావు చైర్మన్ రమేష్ నాయుడు బోర్డు మెంబర్లు

శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైలం మల్లన్న లడ్డు అనగానే భక్తులు కండ్లకు అద్దుకుని నోటిలో వెసుకుని తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటారు మల్లికార్జునస్వామి వారి దర్శనం చేసుకునేందుకు ఆలయం ప్రాంగణంలో అడుగుపెట్టగానే గుమగుమలాడే లడ్డు సువాసనలు వెదజల్లుతూ భక్తుల మనసును దోచేస్తుంది మల్లన్న లడ్డు ప్రసాదం ఆలయం ప్రాంగణంలో సుచి శుబ్రత ప్రమాణాలతో నియమ నిష్టలతో ఆధ్యాత్మిక వరవడితో కలసి కలగలపులతో మల్లన్న లడ్డు తయారు చేస్తారు సిబ్బంది స్వామిఅమ్మవార్లకు నైవేద్యంగా పెట్టిన తరువాత భక్తి భావంతో లడ్డు ప్రసాదాలను లడ్డు కౌంటర్లకు తరలించి భక్తులకు స్వామిఅమ్మవార్ల లడ్డు ప్రసాదాలను అందుబాటులోకి ఉంచుతారు ఆలయ అధికారు నిత్యం వేలాదిగ తరలివచ్చే భక్తులు భక్తి భావంతో మల్లన్న లడ్డు కొనుగోలు చేసి తమ నివాస గృహాలకు తీసుకువెళ్లి అక్కడ పూజ గదిలో పూజలు నిరగవహించుకుని వారి బందువులకు చుట్టుక్కల ఆత్మీయులకు మల్లన్న లడ్డు ప్రసాదం అందజేయడం భక్తుల ఆనవాయితీ అంతటి మహిమగల లడ్డు ప్రసాదం ఇప్పుడు భక్తులకు చేరువ చేసేందుకు శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు చైర్మన్ రమేష్ నాయుడు బోర్డు సభ్యులు భక్తులకు అనువుగా ఉచ్చిత లడ్డు ప్రసాదం కూడ అందుబాటులోకి తెచ్చారు.నూతన ట్రస్ట్ బోర్డు ఎన్నికైన తరువాత భక్తులకు లడ్డు ప్రసాదం విషయంలో మరింత దగ్గరగ అవగాహన కల్పిస్తూ చైర్మన్ రమేష్ నాయుడు ఈఓ శ్రీనివాసరావు చొరువ తీసుకుని భక్తులకు తీపి కబురందించారు.శ్రీ స్వామిఅమ్మవారి స్పర్శ దర్శం టికెట్ తీసుకున్న ప్రతి భక్తుడికి ఉచ్చితంగా రెండు లడ్డులు అందిస్తూ భక్తులకు చేరవ అవుతున్నారు చైర్మన్ రమేష్ నాయుడు ఈఓ శ్రీనివాసరావు అంతే కాకుండా అతి శీఘ్ర దర్శనం అనగా 300 రూపాయల టికెట్ తీసుకున్న ప్రతి భక్తుడికి ఉచ్చితంగా ఒక లడ్డు ప్రసాదం అందించడంతో భక్తులలో ఆనందోత్సాహాలతో అధికారులకు ట్రస్ట్ బోర్డు మెంబర్లకు ఈఓ శ్రీనివాసరావుకు చైర్మన్ రమేష్ నాయుడుకు కృతగ్నతలు తెలుపుతున్నారు. శ్రీశైలం మల్లన్న మహిమగల లడ్డు ప్రసాదాలను కొందరు అన్యమతస్తులు మరికొందరు ఆకతాయిలు లడ్డు ప్రసాదాలలో అక్రమాలు జరుగుతున్నాయని వచ్చే ఆరోపణలలో నిజం లేదని భక్తుల మనోభాలు కాపాడాలసిన అవసరం ఎంతైన ఉందని ఈఓ శ్రీనివాసరావు చైర్మన్ రమేష్ నాయుడు భక్తులకు వివరించారు శ్రీశైలం మల్లన్న లడ్డు ప్రసాదాలలో కాని లడ్డు కౌంటర్లలో కాని ఎలాంటి అక్రమాలు అవకతవకలు జరుగలేదని నిరంతరం నిఘా నేత్రలతో సిబ్బంది పరగయావేక్షనలో పర్యావేక్షిస్తు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామని తెలిపారు శ్రీశైల లడ్డు ప్రసాదం తయారీ ఒక యజ్ఞం లాంటిది. స్వచ్ఛమైన ఆవు నెయ్యిలో బూందీని వేయించి, స్వచ్ఛమైన బెల్లం పాకంతో కలిపి, యాలకులు, జీడిపప్పు, ఎండుద్రాక్ష, కలకండతో తయారు చేస్తామని . ఆలయ అధికారుల పర్యవేక్షణలో, సిబ్బంది తలకు టోపీ, చేతికి గ్లౌజులు ధరించి, సీసీటీవీ నిఘా మధ్య ఈ ప్రసాదాన్ని తయారు చేస్తారు. అందుకే ఈ లడ్డుకు ఐ ఎస్ ఓ 22000 ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేషన్ కూడా ఉందని తెలిపారు.మామూలు తీపి కాదిది: మల్లన్న అభిషేకం, భ్రమరాంబ అమ్మవారి కుంకుమార్చన తర్వాత స్వామికి నివేదించిన మహా ప్రసాదమని ఈఓ శ్రీనివాసరావు చైర్మన్ రమేష్ నాయుడు వెల్లడించారు శ్రీశైలం మల్లన్న లడ్డు ప్రసాదం అమోఘం అమృతమని భక్తులు భక్తిభావంతో కొనుగోలు చేస్తున్నట్లు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.భక్తులకు ఈ లడ్డు కేవలం ప్రసాదం కాదు, ఒక భావోద్వేగం. నల్లమల అడవులను దాటి, కాలినడకన వందల కిలోమీటర్లు నడిచి వచ్చే భక్తుడు, మల్లన్న దర్శనం తర్వాత తన ఇంటికి తీసుకెళ్లేది ఈ లడ్డునే. తమ ఇంట్లో వాళ్లకు, బంధువులకు పంచితే, మల్లన్న ఆశీస్సులు ఇంటికి చేరినట్లు భావిస్తారు. అందుకే ఇప్పుడు ఆలయ పాలకమండలి స్పర్శ దర్శనం చేసుకున్న వారికి రెండు లడ్డూలు, శీఘ్ర దర్శనం చేసుకున్న వారికి ఒక లడ్డూను ఉచితంగా అందిస్తోంది. మహాశివరాత్రి, ఉగాది లాంటి పర్వదినాల్లో లక్షల సంఖ్యలో లడ్డూలను తయారు చేసి పంచుతున్నారు.శ్రీశైలం మల్లన్న లడ్డులో అక్రమాలు జరుగుతున్నాయని కొందరు అన్యమతస్తూలు హిందువుల మనోభావాలు దెబ్బదినే విధంగా వైరల్ చేస్తున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు కట్టుదిట్టమైన నీఘా నేత్రాలతో సిసి కెమరాల పర్యవేక్షణలో నిత్యం పర్యావేక్షిస్తూ అధికారులు సిబ్బంది భక్తుల సేవలో నిమగ్నమైయ్యారు లడ్డు కౌంటర్లలో కాని లడ్డు తయారిలో కాని నిఘా నేత్రాలతో అధికారులు పర్యావేక్షణ ఉంటుందని ఎవరైనా భక్తులు మనోభాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించిన తప్పుడు న్యూస్ కథనాలు వైరల్ చేసిన ఆరోపణలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఓ శ్రీనివాసరావు చైర్మన్ రమేష్ నాయుడు మీడియాకు తెలిపారు

బాధిత కుటుంబానికి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక సాయం.

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)పాపన్నపేట మండలంలోని అబ్లాపూర్ గ్రామానికి చెందిన ముమ్మని బాలయ్య అకాల మరణం పట్ల బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు తన తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందజేశారు.ఈ కార్యక్రమంలో అబ్లాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కానాపురం లింగంగౌడ్, కొంపల్లి కిష్టయ్య, ముమ్మని బాగయ్య, ముమ్మని నర్సింలు, చాకలి కుమార్, శేగ్గరి నర్సింలు, శేగ్గరి రమేష్‌గౌడ్, సీతానగరం నరేష్, చీకోటి ఎల్లప్పతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువుల ఆశీస్సులతో సన్మార్గంలో నడవాలి.

మాధవానంద సరస్వతి స్వామివారి పాదుకా పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్. పద్మా దేవేందర్‌రెడ్డి.

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)గురువుల ఆశీస్సులతో జీవితంలో సన్మార్గంలో నడుస్తూ ఆధ్యాత్మిక విలువలను ఆచరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలోని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి నివాసంలో గురువారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి పాదుకా పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

-ప్రతి ఒక్కరిలో దైవత్వాన్ని గుర్తించాలి

-శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి

భగవంతుడు నిర్దిష్టమైన పేరు, రూపానికి పరిమితం కాదని, ప్రతి ఒక్కరిలోనూ దైవత్వాన్ని గుర్తించాలని సూచించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మనకు సహాయపడే వ్యక్తులను గౌరవించాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని అన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కర్తవ్యాన్ని విస్మరించకూడదని, చేయాల్సిన పనిని నిష్ఠతో నిర్వహించాలని హితవు పలికారు.కోట్ల రూపాయలు వెచ్చించి అన్నదానం చేసినా, ముందుగా కన్నవారైన తల్లిదండ్రులకు అన్నం పెట్టి, వారి బాగోగులు చూసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరినీ ప్రేమతో చూడాలని, సేవాభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. బట్టి జగపతి నిష్ఠతో, పవిత్రమైన జీవన విధానాన్ని అలవర్చుకుని పాదుకా పూజ నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ, ఆయన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూలి పాదుకా పూజ గురువుల పట్ల భక్తి, గౌరవాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు ఆధ్యాత్మిక విలువలను చాటిచెబుతాయని అన్నారు. గురువుల బోధనలను ఆచరిస్తూ ప్రేమ, సేవాభావంతో సమాజానికి మేలు చేయాలని సూచించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలనిఆకాంక్షించారు.స్వామివారు మెదక్ పట్టణానికి విచ్చేసి తమ కుటుంబంతోపాటు పట్టణ ప్రజలను ఆశీర్వదించడం ఆనందంగా ఉందని బట్టి జగపతి తెలిపారు.కార్యక్రమానికి విచ్చేసిన పద్మా దేవేందర్‌రెడ్డి,సుభాష్‌రెడ్డి,కంఠరెడ్డి. తిరుపతి రెడ్డికి,మెదక్ బ్రాహ్మణ మండలి సభ్యులు, వివిధ గ్రామాల

ఎంపీ వంశీకృష్ణ పర్యటనపై..

రాజకీయాలు తగదు మాల మహానాడు హెచ్చరిక..

ఎంపీ దళితుడైనందుకు అతనిపై చిన్న చూపా...

ఇంకా కూడా కుల వివక్షత పోవడం లేదు...

మంథని (ప్రశ్న న్యూస్) పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు పర్యటనపై కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించడం సరికాదని లిమాల మహానాడు రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసేందుకు మాత్రమే ఎంపీ కొయ్యూరు వచ్చారని, ఇది అధికారిక కార్యక్రమం కాదని నాయకులు స్పష్టం చేశారు. పాఠశాల హెచ్ఎం ఇచ్చిన వినతిపత్రం మేరకే ఈ పంపిణీ జరిగిందని వివరించారు.కొందరు పనిగట్టుకొని ప్రొటోకాల్ పేరుతో రాద్ధాంతం చేస్తున్నారని, దళిత ఎంపీ ఎదుగుదలను ఓర్వలేకనే కార్యకర్తలను కలవనివ్వకుండా అడ్డుకోవడం, ఫ్లెక్సీలు చింపేయడం, దేవాలయాల్లో సైతం అమర్యాదగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు కాంగ్రెస్ పార్టీ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేసిన కుటుంబం ఎంపీ వంశీకృష్ణది అని గుర్తుచేశారు. ఈ కుట్రల వెనుక ఎవరున్నా తక్షణమే తమ వైఖరి మార్చుకొని బహిరంగ సంజాయిషీ ఇవ్వాలని, లేనిపక్షంలో మాల మహానాడు తరఫున తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పంటల వైవిధ్యీకరణ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల సాగుపై శిక్షణ

ధర్పల్లి (ప్రశ్న న్యూస్)నిజామాబాదు జిల్లా ధర్పల్లి మండలంలోని హోన్నాజిపేట రైతు వేదికలో పంటల వైవిధ్యీకరణలో భాగంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు నూనె గింజల పంటల సాగుపై ఆర్ పి యల్ ఆధారిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఏడీఏ ఆంజి ప్రసాద్ , ధర్పల్లి మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) జె వెంకటేష్ , హోన్నాజిపేట పీఏసీఎస్ చైర్మన్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యతను వివరించారు. వరి పంటపై అధికంగా ఆధారపడకుండా, స్థానిక వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత,నేల స్వభావానికి అనుగుణంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు భూగర్భ జలాల కొరతను దృష్టిలో ఉంచుకొని, రైతులు పంటల మార్పిడితో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అధికారులు తెలిపారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకునే అవకాశాలతో పాటు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ, ప్రాంతానికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని కోరారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా సాగు ఖర్చులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగు పరచుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని పంటల సాగు విధానాలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక,వ్యవసాయ సాంకేతిక అంశాలపై అవగాహన పొందారు.

చియ్యవరంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విస్తృత ప్రచారం

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)గ్రామ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు శ్రీకాళహస్తి త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు నూక బాలాజీతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో స్థానిక ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్వయంగా గ్రామంలో పర్యటించి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు నూక బాలాజీ మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.మిగిలిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కూటమి భాగస్వామ్య పార్టీల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండపల్లిని అభివృద్ధిలో

అగ్రస్థానంలో నిలుపుతా

- ఎమ్మెల్యే వసంత ఆశీస్సులతో ముందుకు..
- కూటమి ఛైర్మన్ అభ్యర్థి కన్నెకంటి అమూల్య

కొండపల్లి (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా కొండపల్లి బొమ్మలకు ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లే.. అభివృద్ధిలోనూ కొండపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక స్థానం తీసుకొస్తానని కూటమి చైర్మన్ అభ్యర్థి కన్నెకంటి అమూల్య పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆశీస్సులు, సహకారంతో కొండపల్లిని రాష్ట్రంలోనే అభివృద్ధికి ఆదర్శంగా నిలుపుతానని ఆమె తెలిపారు. కూటమి నాయకులతో కలిసి మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తనపై నమ్మకం ఉంచి చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌తో పాటు కూటమి నాయకులకు అమూల్య కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తమకు ప్రజల్లో మద్దతు తీసుకొస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

తుపానులోనూ వైద్య సేవలు..

పక్షవాతానికి తక్షణ చికిత్స

- 3,100 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలింపు.. 367 ప్రసవాలు
- తుపాను దెబ్బకు 64 ఆసుపత్రుల్లో నష్టం.. అయినా ఆగని వైద్య సేవలు

అమరావతి(ప్రశ్న న్యూస్) ఓ వైపు తుపాను బీభత్సం.. మరోవైపు అత్యవసర వైద్య సేవల సవాలు! ప్రకృతి ప్రకోపంతో ఆసుపత్రుల భవనాలు, పైకప్పులు, విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నా వైద్య ఆరోగ్య శాఖ సేవలు కొనసాగించింది. ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణులను గుర్తించి ఆసుపత్రులకు తరలించడంతోపాటు అంబులెన్సులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు, సంచార వైద్య బృందాలను రంగంలోకి దించింది. తుపాను సమయంలోనే 3,100 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించగా.. 367 ప్రసవాలు నమోదయ్యాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా 64 ఆసుపత్రుల భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లడం వైద్య వ్యవస్థకు సవాలుగా మారింది.

గర్భిణులకు ముందస్తు భరోసా..

ప్రసవానికి రెండు వారాల్లోపు గడువు ఉన్నవారు, అధిక ప్రమాద గర్భిణులు కలిపి 4,228 మందిని అధికారులు గుర్తించారు. వీరిలో 3,100 మందిని ముందస్తు జాగ్రత్తగా వివిధ ఆసుపత్రులకు తరలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలల ఆసుపత్రుల వరకు, ప్రైవేటు ఆసుపత్రుల వరకు వైద్య సదుపాయాలను వినియోగించుకున్నారు. తరలించిన గర్భిణుల్లో 367 మందికి ప్రసవాలు జరిగాయి.వైద్య సేవలకు అంతరాయం కలగకుండా 485 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. వీటి ద్వారా 43 మందిని ఆసుపత్రులకు తరలించారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవల కింద 196 వాహనాలను సిద్ధం చేయగా, వాటి ద్వారా మరో 15 మందికి ఆసుపత్రి సేవలు అందాయి. అదనంగా 549 సంచార వైద్య వాహనాలను సిద్ధంగా ఉంచి 50 వైద్య శిబిరాలను నిర్వహించారు.

64 ఆసుపత్రులకు తుపాను దెబ్బ...

తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఆసుపత్రుల భవనాలు, పైకప్పులు, విద్యుత్ పరికరాలు, జనరేటర్లు, నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. కైకలూరు, బారువ, టెక్కలి, అగనంపూడి, పెందుర్తి, నక్కపల్లి, నర్సీపట్నం, రేపల్లె, అమలాపురం, రంపచోడవరం, ముమ్మిడివరం, అల్లవరం, కొత్తపేట, నెల్లిమర్ల ఆసుపత్రుల్లో నష్టం నమోదైంది. పెనుమంత్ర, దేవపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రహరీ గోడలు దెబ్బతిన్నాయి.ఏలూరు, గుంటూరు, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో విద్యుత్ తీగలు, జనరేటర్లు, ఇతర పరికరాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లింది. విశాఖపట్నంలోని ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో ఆపరేషన్ గదుల పైకప్పుల నుంచి నీరు కారడం, పాత భవనంలో లీకేజీలు, కిటికీలు, తలుపులు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తాయి. అత్యవసర వైద్య సేవలకు కీలకమైన ఆసుపత్రులే దెబ్బతినడంతో నష్టాన్ని అంచనా వేసి మరమ్మతులు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పక్షవాతానికి తెనాలిలోనే ఉన్నత చికిత్స...

పక్షవాతం వచ్చినప్పుడు ప్రతి నిమిషం కీలకమే. సకాలంలో చికిత్స అందితే ప్రాణాలను కాపాడటంతోపాటు తీవ్ర వైకల్యం ముప్పును తగ్గించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలోనే ఉన్నత వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. తెనాలి జిల్లా ఆసుపత్రిలో హబ్ అండ్ స్పోక్ విధానంలో పక్షవాత బాధితులకు చికిత్స అందించడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది.ఈ విధానంలో తెనాలి ఆసుపత్రి స్పోక్ కేంద్రంగా, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) హబ్‌గా వ్యవహరిస్తోంది. తెనాలిలో బాధితులకు ప్రాథమిక పరీక్షలు, సీటీ స్కానింగ్ నిర్వహించి, నివేదికలను ప్రత్యేక పక్షవాత యాప్ ద్వారా గుంటూరులోని నిపుణులకు పంపిస్తున్నారు. వారు నివేదికలను పరిశీలించి తదుపరి చికిత్సపై సూచనలు అందిస్తున్నారు.గత ఆగస్టు నుంచి అమలులో ఉన్న ఈ ప్రయోగాత్మక విధానంలో ఇప్పటివరకు 58 మంది బాధితులకు చికిత్స అందించారు. వారిలో తొమ్మిది మందికి రక్తపు గడ్డను కరిగించే టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్లు ఇచ్చారు. వారు కోలుకున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ విధానం పనితీరును పరిశీలించి ఇతర జిల్లా ఆసుపత్రులకూ విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

పుష్కరాలకు పది రోజుల ముందే భద్రాద్రి సిద్ధం

- ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి డెడ్‌లైన్

భద్రాచలం(ప్రశ్న న్యూస్) గోదావరి పుష్కరాల నాటికి భద్రాద్రి రూపురేఖలు మారాలి! దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు మెరుగైన సౌకర్యాలు అందాలి! ఈ లక్ష్యంతో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత వేగం కొనసాగితే గోదావరి పుష్కరాలకు పది రోజుల ముందే ఆలయ అభివృద్ధి పనులు పూర్తవుతాయని ధీమా వ్యక్తం చేశారు. దీంతో భద్రాద్రి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

స్లాబులు పూర్తి.. రాతి పనులకు రంగం సిద్ధం..

భద్రాచలంలో గురువారం శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అనంతరం ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తదితరులతో కలిసి దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్ల దారి వరకు, దేవస్థానం పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు.ప్రస్తుతం నిర్మాణాల్లో స్లాబుల పనులు పూర్తయ్యాయని, నవంబర్ మొదటి వారం తర్వాత రాతి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు చెక్..

ప్రాణనష్టమే లేని జిల్లాగా మేడ్చల్

- జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్ పథకం పకడ్బందీ అమలుకు చర్యలు
- బ్లాక్‌స్పాట్ల గుర్తింపు.. వారం రోజుల్లో శాఖల వారీగా సమీక్షా సమావేశం
చీకటి రహదారులపై వెలుగులు.. జీబ్రా క్రాసింగ్‌ల ఏర్పాటుకు ప్రణాళిక

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించి, విలువైన ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలుకు ప్రత్యేకంగా ఎంపిక చేసిన జిల్లాల్లో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కూడా ఉందని పేర్కొన్నారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్న సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చూపేందుకు సంబంధిత శాఖలతో సమన్వయంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.
జిల్లా పరిధిలో సుమారు 27 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉన్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు అవసరమని అధికారులు గుర్తించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి రహదారుల పరిస్థితులు, వెలుతురు కొరత, పాదచారులు రోడ్డు దాటే ప్రాంతాలు తదితర అంశాలను సమీక్షించారు.

బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి

జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆనంద్, జిల్లా రవాణా శాఖ అధికారి ప్రవీణ్‌దర్ రాజు, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ వెంకటేశ్వరరావు, మేడ్చల్ సీఐ అంజిరెడ్డి తదితర అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి, అవసరమైన నివారణ చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బ్లాక్‌స్పాట్ల వద్ద ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులతో వారం రోజుల్లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, రవాణా, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం పెంచి, గుర్తించిన సమస్యలకు ప్రాధాన్య క్రమంలో పరిష్కారాలు చూపుతామని స్పష్టం చేశారు. చేపట్టిన చర్యలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అనే అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.

చీకటి రహదారులపై వెలుగులు

రహదారులపై తగిన వెలుతురు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నట్లు అధికారులు గుర్తించారు. అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు, జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందించే సూచిక బోర్డులు, ఇతర భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేలా చర్యలు తీసుకోవడం, రహదారుల లోపాలను సరిచేయడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు.

ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు వైద్య సహాయం అందించడం ప్రాణాలను కాపాడటంలో కీలకమని అధికారులు తెలిపారు. ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా అందే ప్రయోజనాలు కల్పించేందుకు కృషి చేస్తామని ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి వెల్లడించారు.

భూ ఆధార్'తోనే లొకేషన్ గుర్తింపు

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

డబీల్‌పూర్‌లో భూ రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్
లోటుపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని ఆదేశం
సాంకేతిక విధానాన్ని వివరించిన తహసీల్దార్ వీరనాల భూపాల్

మేడ్చల్(ప్రశ్న న్యూస్)తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడ్చల్ మండల పరిధిలోని డబీల్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వే పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పట్టాదారు పాసుపుస్తకంలోని 'భూ ఆధార్ నంబర్' ఆధారంగా ఆన్‌లైన్‌లో భూమి లొకేషన్‌ను గుర్తించే సాంకేతిక విధానాన్ని మండల తహసీల్దార్ వీరనాల భూపాల్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో జరుగుతున్న లొకేషన్ గుర్తింపు ప్రక్రియను పరిశీలించిన అనంతరం అదనపు కలెక్టర్ స్థానిక రైతులతో మాట్లాడి సర్వేపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని సర్వేయర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్, సర్వే బృందం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతను కాపాడాలని డిమాండ్

క్యాంపస్‌లో ఇకపై సినిమా ప్రమోషన్లు ఉండవని ప్రకటించిన మల్లారెడ్డి
ఈనెల 30న ఇచ్చిన సెలవును రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన మల్లారెడ్డి

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) విద్యార్థుల భద్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లారెడ్డి యూనివర్సిటీ ముందు కదం తొక్కారు. కళాశాల భవనం ముందు బైఠాయించి తమ నిరసనను తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, యూనివర్సిటీలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసే కేంద్రాలుగా ఉండాలని, సినిమా ప్రమోషన్లకు వేదికలుగా మారకూడదని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు లక్షల రూపాయల ఫీజులు చెల్లిస్తున్నది నాణ్యమైన విద్య, కోసమేనని తెలిపారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో టాక్సిక్ సినిమా కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు గాయపడిన ఘటన తోపాటు ఆదర్శ కుటుంబం సినిమా ప్రమోషన్ సందర్భంగా మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఈనెల 30వ కాలేజ్ హాలిడే ఇస్తానని ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు విద్యార్థుల విద్యా సమయానికి, భద్రతకు భంగం కలిగించే కార్యక్రమాలను యాజమాన్యం ప్రోత్సహించకూడదని డిమాండ్ చేశారు. టాక్సిక్ సినిమా కార్యక్రమంలో విద్యార్థులు గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కార్తీక్ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, విద్యార్థుల ప్రాణాలకు విద్యా హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల ఆందోళనకు స్పందించిన మల్లారెడ్డి యూనివర్సిటీ ఛైర్మన్ చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ ఈనెల 30న ప్రకటించిన సెలవు రద్దు చేస్తున్నానని ప్రకటించారు.క్యాంపస్‌లో ఇకపై సినిమా ప్రమోషన్లు ఉండవని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్, మండల అధ్యక్షుడు సాయి, మండల కార్యదర్శి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్యామ్ భగత్, జిల్లా కమిటీ సభ్యులు అజయ్, యశ్వంత్, అనిరుధ్, సాయి, కౌశిక్, కర్ణాకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పలాస పురపోరులో కూటమి దూకుడు

- సైకిల్.. గ్లాసుకు ఓటేయండి,అభివృద్ధి బాధ్యత మాదే - గౌతు శిరీష, కూన రవికుమార్ ప్రచార హోరు,

పలాస(ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల వేళ పలాసలో కూటమి ప్రచారం జోరందుకుంది. టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి వజ్జ గంగాభవాని, జనసేన కౌన్సిలర్ అభ్యర్థి అట్టాడ వాసుదేవరావు విజయమే లక్ష్యంగా కూటమి నేతలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రంగంలోకి దిగి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. సైకిల్, గ్లాసు గుర్తులపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలే తమ ప్రాధాన్యాలని నేతలు స్పష్టం చేశారు.

అభివృద్ధికి అండగా నిలవండి: గౌతు శిరీష

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. వార్డుల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రెండున్నరేళ్లలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. 20వ వార్డు జనసేన అభ్యర్థి అట్టాడ వాసుదేవరావుతో పాటు టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి వజ్జ గంగాభవానిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అది సీక్వెల్ కాదు, అక్కడితోనే క్లోజ్.. ధనుష్ 'ఓం' సినిమాపై క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓం -- చాప్టర్ 1. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి వెల్లడించిన ఆసక్తికరమైన విషయాలు సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. 'ఓం' చాప్టర్ 1, చాప్టర్ 2 సినిమాల మధ్య ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు స్పష్టం చేశారు. ఈ సినిమా టైటిల్‌లో 'చాప్టర్ 1' అని ఉన్నప్పటికీ, ఇది రెండు భాగాలుగా కొనసాగే సీక్వెల్ కాదని, మొదటి భాగంతోనే ఈ కథ పూర్తిగా ముగిసిపోతుందని ఆయన వెల్లడించారు. అలాగే తాము ఈ చిత్రాన్ని కేవలం ఒక భాషలో మాత్రమే కాకుండా, ద్విభాషా చిత్రంగా ప్లాన్ చేయనప్పటికీ.. తమిళ మరియు తెలుగు ప్రేక్షకులు ఇద్దరూ దీన్ని తమ సొంత స్ట్రైట్ సినిమా అనే అనుభూతిని పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నటీనటుల పాత్రలు అంత్యంత ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ముఖ్యంగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి (ఏఎస్పీ నిత్యా రెడ్డి పాత్రలో) మరియు టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల ఇద్దరి పాత్రలు వారి ఇప్పటివరకు చేసిన సినిమాలకు, వారి కంఫర్ట్ జోన్‌కు పూర్తిగా భిన్నంగా, అవుట్ అండ్ అవుట్ కొత్తగా ఉంటాయని పేర్కొన్నారు.

ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వండర్‌బార్ ఫిలింస్ మరియు ఆర్‌టేక్ స్టూడియోస్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

'కల్ట్' రిలీజ్ ట్రైలర్.. రక్తపాతం, భయంకరమైన హత్యలతో విశ్వక్ సేన్ విశ్వరూపం!

టాలీవుడ్ నటుడు విశ్వక్ సేన్ మరోసారి దర్శకుడిగా తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కల్ట్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. భారతీయ సినిమాలో తొలి స్లాషర్ చిత్రంగా ప్రచారం పొందుతున్న ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ లభించింది. థియేటర్లలో విడుదలకు కొన్ని గంటల ముందు చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. కత్తిపోట్లు, కోతలు, భయపెట్టే సన్నివేశాలతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి ట్రైలర్‌లో సినిమా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, ఓ పార్టీలో జరిగే హింసాత్మక ఘటనల గురించి చూపించారు. తాజాగా వచ్చిన రిలీజ్ ట్రైలర్‌లో మాత్రం విశ్వక్ సేన్ పోషించిన డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. గోవాలో స్థానికులు స్థానికేతరులను, ముఖ్యంగా తెలుగు వారిని ఇబ్బందులకు గురిచేయడాన్ని సంకల్ప్ సహించడు. వారిని రక్షించాలనే ఉద్దేశంతో గోవాకు వెళ్లిన అతడి చుట్టూ కథ తిరుగుతుంది. ట్రైలర్ చివర్లో పార్టీలో అతడు సాగించే హత్యాకాండను చూపించారు. యాక్షన్‌తో పాటు స్లాషర్ తరహా సన్నివేశాలు ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ దూకుడు, క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాత్రకు తగ్గట్టుగా ఆయన ఆగ్రహాభరితమైన నటన ఆకట్టుకుంటోంది. హింసాత్మక సన్నివేశాలను కూడా ప్రత్యేకమైన శైలిలో, కొంత కార్టూన్ తరహా రూపంలో తెరకెక్కించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో మురళీ శర్మ రాజకీయ నాయకుడిగా, శ్రీకాంత్ అయ్యంగార్ సీనియర్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతాన్ని అందించగా, తరుణ్ భాస్కర్ సంభాషణలు రాశారు. విడుదల ట్రైలర్‌లో కనిపిస్తున్న రక్తపాతం, వేగవంతమైన యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మరి 'కల్ట్' ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

భారతీయ ఇతిహాసం..

అత్యుత్తమ రూపంలో రామాయణం

భారతీయ ఇతిహాసం రామాయణంను వెండితెర దృశ్యమానం చేస్తూ నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణ' నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. సీతారాముల పాత్రల్లో సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా, యశ్ రావణుడిగా కనిపించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'రామాయణ' మొదటి భాగం ప్రపంచ ప్రీమియర్ కోసం చిత్ర బృందం లాస్‌ఏంజిల్స్‌కు పయనమైంది. ఈ సందర్భంగా అక్కడి అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన సాయిపల్లవి సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భారతీయ సంస్కృతి, ఇతిహాసాల గురించి తెలుసుకోవాలనుకునే విదేశీ ప్రేక్షకులకు ఈ సినిమా గొప్ప అవకాశంగా ఉంటుందని అభిప్రాయపడింది. ఆమె మాట్లాడుతూ 'ఇప్పటివరకూ వచ్చిన రామాయణ నేపథ్య చిత్రాలకు ఇది పూర్తిగా భిన్నమైనదని నేను భావిస్తున్నా. ఈ సినిమా ద్వారా అత్యుత్తమ రూపంలో రామాయణాన్ని ప్రేక్షకులు వీక్షిస్తారు. ఉన్నత ప్రమాణాలతో రూపొందించిన విజువల్ ఎఫెక్ట్స్, సాంకేతిక హంగులు ఈ సినిమాకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి' అని చెప్పింది.

నిహారిక కొణిదెల నిర్మాణంలో నూతన చిత్రం 'పాకెట్ రాకెట్స్'.. టైటిల్ పోస్టర్ రిలీజ్!

ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెలకు చెందిన 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్', 'మాక్సిమం సిటీ స్టూడియోస్' సంస్థలు సంయుక్తంగా నూతన చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'పాకెట్ రాకెట్స్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేయగా, బుధవారం నాడు దీనికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. రుద్ర అత్రి దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో 'కమిటీ కుర్రోళ్ళు' ఫేమ్ త్రినాథ్ వర్మ, నూతన నటుడు నిర్మల్ హీరోలుగా నటిస్తుండగా, 'శుభం' ఫేమ్ శ్రియా కొంతం హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే ఇందులో ప్రముఖ నటుడు జేడీ చక్రవర్తి ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. విదేశాల్లో చదువుకోవాలని కలలు కనే ఓ కుర్రాడు, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి గ్యాబ్లింగ్ (జూదం) వైపు అడుగులు వేయడం, ఆ తర్వాత అతని జీవితంలో ఎదురైన ఊహించని పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా అత్యంత ఆసక్తికరంగా సాగనుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తి కాగా, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన టీజర్ అలాగే రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు. పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి గ్యానీ సంగీతం అందిస్తుండగా, ఎదురోలు రాజు సినిమాటోగ్రాఫర్‌గా, అన్వర్ అలీ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్రినాథ్ వర్మ, శ్రియా కొంతం, నిర్మల్, జేడీ చక్రవర్తితో పాటు శ్రీనివాస్ అవసరాల, శ్రీనివాస్ వడ్లమాని, కిరిటీ దామరాజు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

హృదయానికి దగ్గరైన చిత్రం

అగ్ర కథానాయిక నయనతార నటించిన తాజా తమిళ చిత్రం 'మూకుత్తి అమ్మన్-2' దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. సుందర్ సి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో రెజీనా, ఖుష్బూ, స్నేహ, ఊర్వశి, యోగిబాబు ప్రధాన పాత్రల్ని పోషించారు. 2020లో విడుదలై విజయవంతమైన 'మూకుత్తి అమ్మన్'కు సీక్వెల్ ఇది. ఈ సినిమాలో నయనతార అమ్మవారి పాత్రలో కనిపించనుంది. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా నయనతార సోషల్‌మీడియాలో ఓ భావోద్వేగభరితమైన పోస్ట్‌ను పంచుకుంది. 'ఈ సినిమా నా హృదయానికి ఎంతో దగ్గరైంది. దర్శకుడు సుందర్ సి నా ఆలోచనలు, అభిరుచికి అద్దం పట్టేలా అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ సినిమా ప్రయాణంలో ప్రతీ అడుగు అర్థవంతంగా అనిపించింది. నటిగా, వ్యక్తిగతంగా ఎంతో సంతృప్తినిచ్చిన చిత్రంగా నిలిచిపోతుంది' అని నయనతార తన పోస్ట్‌లో పేర్కొన్నది. తొలిభాగానికి ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహించిన..సీక్వెల్ బాధ్యతలను సుందర్ సి చేపట్టారు.

'పెద్ది' వివాదంపై జాన్వీ కపూర్

సంచలన వ్యాఖ్యలు

అది నా తప్పే అంటూ కామెంట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' సినిమా మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో కథానాయికగా నటించిన జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై గతంలో వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఆమె పాత్రను తెరపై చూపించిన విధానం, కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తాజాగా ఈ వివాదంపై బాలీవుడ్ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో జాన్వీ స్పందించింది. 'పెద్ది' సినిమాలో తన పాత్రపై వచ్చిన విమర్శలను ఎలా తీసుకున్నారని కరణ్ జోహార్ అడిగిన ప్రశ్నకు జాన్వీ కపూర్ భావోద్వేగంగా స్పందించింది. సినిమాలోని కొన్ని సన్నివేశాలు మహిళలను తక్కువ చేసి చూపిస్తున్నాయనే విమర్శల నేపథ్యంలో, నటిగా తాను మరింత అప్రమత్తంగా ఉండాల్సిందని ఆమె అంగీకరించింది.

సినిమా కోసం ఎంతోమంది కష్టపడినా, ఒక సన్నివేశం సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని జాన్వీ అభిప్రాయపడింది. ముఖ్యంగా మహిళల పాత్రలను చిత్రీకరించే విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిందని ఆమె భావించినట్టు తెలుస్తుంది. ఇక ఈ వివాదం గురించి మాట్లాడుతూ, జరిగిన దానికి ఇతరులను నిందించడం తనకు ఇష్టం లేదని జాన్వీ చెప్పింది. దక్షిణాది చిత్ర పరిశ్రమలో కొన్ని సందర్భాల్లో నటీనటులకు సన్నివేశాల చిత్రీకరణ, కెమెరా కోణాల గురించి ముందుగానే పూర్తి వివరాలు తెలియకపోవచ్చని ఆమె అభిప్రాయపడింది.

అయితే తనకున్న గుర్తింపు, స్థాయిని ఉపయోగించి అభ్యంతరకరంగా అనిపించిన సన్నివేశాల్లో మార్పులు చేయాలని కోరాల్సిందని జాన్వీ భావించింది. ఒక నటిగా తన బాధ్యతను మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఈ అనుభవం ఉపయోగపడిందని ఆమె పేర్కొంది.

మందమర్రి నేపథ్యంలో

'రాజు వెడ్స్ రాంబాయి' తర్వాత దర్శకుడు వేణు ఊడుగుల సమర్పణలో రాబోతున్న అడ్వెంచరస్ మూవీ 'చంద్రయాన్'. శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేశ్, బలగం సత్యనారాయణ కీలక పాత్రలుపోషించిన ఈ చిత్రానికి శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకుడు. ప్రవీణ్ మొలక నిర్మాత. నవంబర్ 13న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'చంద్రయాన్' సినిమా రాకెట్‌ని రివీల్ చేస్తూ ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. దర్శకుడు సంకల్ప్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'టీమంతా ప్రాణంపెట్టి పనిచేశారు. కూతురి పెళ్లి చేసినంత ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. డైరెక్టర్ శ్రీనాథ్ మంచి స్క్రిప్ట్ రాసుకున్నాడు. ఇన్నోసెన్స్ ఉన్న సినిమా ఇది. ఇందులో లాజిక్స్ ఉండవు. 'చంద్రయాన్' భారత్ సత్తాను ప్రపంచానికి ఎలాగైతే చాటిందో, ఈ 'చంద్రయాన్' టీమ్ ప్రతిభను ఇండస్ట్రీకి చాటుతుంది' అంటూ నమ్మకంగా చెప్పారు. 'ఊరిజనాల్లో ఏ మాత్రం ఎక్స్‌పెక్టేషన్స్ లేని నలుగురు కుర్రాళ్లు రాకెట్ తయారు చేసి చంద్రునిపైకి వెళ్లాలని డిసైడ్ అవుతారు. మరి వారు అనుకున్నది సాధించారా? మందమర్రి టు చందమామ అంటూ సాగిన వీరి ప్రయాణ హంగామా ఎలా సాగింది?అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా' అని దర్శకుడు శ్రీనాథ్ చంద్రశేఖర్ చెప్పారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

డంప్‌యార్డ్ తొలగింపునకు డీపీఆర్ ఇవ్వండి..

నిధులు తెచ్చే బాధ్యత మాది

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఈటల రాజేందర్ సవాల్..
- బాధితులకు అండగా ఉంటామని భరోసా

కీసర (ప్రశ్న న్యూస్) జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపును డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర మూడో రోజు విజయవంతంగా ముగిసింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, కీసర, చీర్యాల, బండ్లగూడ, నాగారం ప్రాంతాల్లో పాదయాత్ర కొనసాగింది. డంపింగ్ యార్డ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత మహిళలు ఎంపీ ఈటల రాజేందర్, మహేశ్వర్‌రెడ్డిలకు మంగళహారతులతో స్వాగతం పలికి తమ సమస్యలను వివరించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

డీపీఆర్ సిద్ధం చేయండి.. నిధులు తెచ్చే బాధ్యత మాది ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపునకు ఎంత ఖర్చవుతుందో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. డీపీఆర్ అందిస్తే అవసరమైన నిధులను తీసుకురావాల్సిన బాధ్యతను బీజేపీ ఎంపీలుగా తాము స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం తాను ఎంతవరకైనా పోరాడతానని, అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు.

బాధితులకు అండగా తెలంగాణ సమాజం డంపింగ్ యార్డ్ బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఒంటరివారు కాదు.. యావత్ తెలంగాణ మీకు అండగా ఉంది" అని భరోసా ఇచ్చారు. తనకు పెద్దపెద్ద వ్యాపారవేత్తలు స్నేహితులు కాదని, పేద ప్రజలే తనకు నిజమైన స్నేహితులని పేర్కొన్నారు. ఆస్తులు, అంతస్తులను చూసి కాకుండా ప్రజల కష్టాలను గుర్తించి బాధితుల పక్షాన నిలబడటమే తన లక్ష్యమని అన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారు మల్కాజిగిరి ప్రజలు రేవంత్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే, ఆ విజయాన్ని రాజకీయ ఎదుగుదలకు నిచ్చెనగా ఉపయోగించుకున్నారని ఈటల విమర్శించారు. తెలంగాణ కోసం తాను పోరాట చరిత్ర కలిగిన వ్యక్తినని, ప్రజలు తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో నాయకులను ఎన్నుకుంటారని అన్నారు. అయితే, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న పిల్లలు చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ కారణంగా కొందరు పాఠశాలల్లో చేర్చుకోవడానికి కూడా వెనుకాడుతున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాల బాధలను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు.

రేపటి బహిరంగ సభకు భారీగా తరలిరావాలి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. రేపు నిర్వహించనున్న బహిరంగ సభకు బాధితులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలి

- రాజకీయ లబ్ధి కోసమే ఈటల పాదయాత్ర
- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శలు

కీసర(ప్రశ్న న్యూస్) జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయకుండా, రాజకీయ ప్రయోజనాల కోసమే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

గురువారం దమ్మాయిగూడలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా ఏళ్ల తరబడి కాలుష్య సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు విముక్తి కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన సమయంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి ఈటల రాజేందర్ ఏం చేశారని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రజల సమస్యను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలేమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యత కావాలి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వజ్రేష్ యాదవ్ కోరారు. డంపింగ్ యార్డ్ తరలింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లు, మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళ కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పన్నీరు పేరుతో మోసం.. ఏడాది పాటు నిషేధం

- పాలు లేకుండానే పన్నీరు తయారీ, ప్రజారోగ్యంపై ఆందోళన
- తయారీ నుంచి వినియోగం వరకు నిషేధం
- తక్కువ ధరకు హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా
- గెజిట్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి(ప్రశ్న న్యూస్) పన్నీరు తింటున్నామనే నమ్మకంతో కొనుగోలు చేస్తున్నారా? అయితే అప్రమత్తంగా ఉండాల్సిందే! పాలతో తయారయ్యే అసలైన పన్నీరుకు బదులుగా నూనెలు, ఇతర పదార్థాలతో తయారు చేసిన కృత్రిమ పన్నీరు మార్కెట్లో చలామణి అవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజారోగ్య పరిరక్షణ, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కృత్రిమ పన్నీరు తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగంపై ఏడాది పాటు నిషేధం విధించింది. ఈ మేరకు ఆహార భద్రత శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ పేరుతో ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. ఆహార పదార్థాల నాణ్యతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

పాలు లేవు.. నూనెలే దిక్కు..

సంప్రదాయ పన్నీరు పూర్తిగా పాలతో తయారవుతుంది. ఇందులో సహజసిద్ధమైన ప్రొటీన్లు, కాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. అయితే కృత్రిమ పన్నీరు తయారీలో పాలకు బదులుగా పామాయిల్ వంటి వంట నూనెలు, శాఖాహార కొవ్వులు, మీగడ తీసిన పాలపొడి, ఇతర మిశ్రమ పదార్థాలను వినియోగిస్తారు. చూడటానికి అసలైన పన్నీరులాగే కనిపించినా.. తయారీ విధానం, ముడి పదార్థాలు, పోషక విలువల్లో గణనీయమైన తేడాలు ఉంటాయి. ఈ వ్యత్యాసాలను సాధారణ వినియోగదారులు గుర్తించడం కష్టంగా మారుతోంది.

తక్కువ ధరే ప్రధాన ఆకర్షణ..

అసలైన పాల పన్నీరుతో పోలిస్తే కృత్రిమ పన్నీరు తయారీ వ్యయం తక్కువ. ధర కూడా తక్కువగా ఉండటంతో హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లలో దీనిని ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని సందర్భాల్లో కృత్రిమ చీజ్‌ను సైతం పన్నీరు పేరుతో వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. వ్యాపారులకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి రావడం, కొంతకాలం నిల్వ ఉంచుకునే అవకాశం ఉండటం దీని వినియోగానికి కారణాలుగా కనిపిస్తున్నాయి అయితే పన్నీరు పేరుతో వినియోగదారులకు ఏ పదార్థాన్ని అందిస్తున్నారు? అందులో ఉపయోగించిన ముడి పదార్థాలేమిటి? దాని పోషక విలువలేంటి? అనే అంశాలపై స్పష్టత లేకపోతే వినియోగదారులు తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కృత్రిమ పన్నీరు తయారీ నుంచి వినియోగం వరకు నిషేధిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

పన్నీరు కొనుగోలు చేసేటప్పుడు దాని రంగు, వాసన, మెత్తదనం, వేడి చేసినప్పుడు కనిపించే మార్పులను గమనించాలని ఆహార భద్రత శాఖ డైరెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. నాణ్యతపై అనుమానం కలిగించే లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ముఖ్యంగా మార్కెట్ ధర కంటే అసాధారణంగా తక్కువ ధరకు లభించే పన్నీరు ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే రంగు, వాసన, మెత్తదనం వంటి లక్షణాలను బట్టి మాత్రమే పన్నీరు అసలైనదా, కృత్రిమమైనదా అని కచ్చితంగా నిర్ధారించలేమని వినియోగదారులు గుర్తించాలి. విశ్వసనీయ విక్రయదారుల వద్ద కొనుగోలు చేయడం, ప్యాకెట్‌పై ఉన్న లేబుల్, పదార్థాల వివరాలు, తయారీదారు సమాచారం పరిశీలించడం ముఖ్యం.

దేశవ్యాప్తంగా కట్టడికి చర్యలు

కృత్రిమ పన్నీరు విక్రయాలపై దేశవ్యాప్తంగా నియంత్రణ చర్యలు చేపట్టాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏడాది పాటు నిషేధం విధిస్తూ గెజిట్ జారీ చేసింది.

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్ట్‌టైం అధ్యాపకుల మహాధర్నా

- 12 నెలలు పనిచేస్తున్నా.. 6 నెలలే జీతం
- ఉద్యోగ భద్రత కల్పించాలి.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు ముందే సమస్యలు పరిష్కరించాలి
- అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: ఉన్నత విద్యా మండలి చైర్మన్ హామీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి పరిపాలనా భవనం ఎదుట అధ్యాపకులు పెద్ద సంఖ్యలో బైఠాయించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

12 యూనివర్సిటీల్లో 80 శాతానికి పైగా పార్ట్‌టైం అధ్యాపకులు..

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 80 శాతానికి పైగా ఉన్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ ఉన్నత విద్యా వ్యవస్థకు సేవలందిస్తున్న తమకు కనీస ఉద్యోగ భద్రత లేకపోవడం, వేతనాల విషయంలో అన్యాయం జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

12 నెలలు పని.. ఆరు నెలలకే జీతం ఎలా.?

సంవత్సరమంతా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కేవలం ఆరు నెలలకే వేతనాలు చెల్లిస్తున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు 12 నెలల వేతనం చెల్లించాలని, కన్సాలిడేటెడ్ పే విధానంలో న్యాయం చేయాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నియామకాలకు ముందే సమస్యలు పరిష్కరించాలి..

రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టే ముందే పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ నియామకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ప్రతి పార్ట్‌టైం అధ్యాపకుడికి ఇంటర్వ్యూలో పాల్గొనే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ సేవలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: ఉన్నత విద్యా మండలి

అధ్యాపకుల డిమాండ్లపై తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ స్పందించారు. పార్ట్‌టైం అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కచ్చితంగా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ పాలడుగు జీవన్, డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి, డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ కాటేపాగ యుగంధర్, , డాక్టర్ వీరు యాదవ్, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ రవీందర్, డాక్టర్ ఫక్రుద్దీన్, డాక్టర్ పండారి, డాక్టర్ డారి రెడ్డి, డాక్టర్ సంపత్, డాక్టర్ సాగర్, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ సునీల్ గౌడ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అశోక్, డాక్టర్ యాదయ్య, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ఉసామాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో పులి పంజా

- ఇంటింటా పులి అరుణకుమారి దాస్ ప్రచార హోరు

కొండపల్లి(ప్రశ్న న్యూస్) కొండపల్లి మున్సిపాలిటీలోని 21వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి పులి అరుణకుమారి దాస్ ఇంటింటి ప్రచారంతో ఎన్నికల సందడిని పెంచుతున్నారు. ప్రతి గడపను పలకరిస్తూ, ప్రజలతో మమేకమవుతూ తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, డివిజన్ అభివృద్ధికి కృషి చేసే ప్రతినిధిగా నిలవాలనే లక్ష్యంతో ఆమె ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

గడపగడపకూ అభ్యర్థి...

ఎన్నికల ప్రచారంలో ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడమే ప్రధానమనే భావనతో పులి అరుణకుమారి దాస్ ఇంటింటి పర్యటనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజల అవసరాలు ఏమిటి? డివిజన్‌లో పరిష్కరించాల్సిన సమస్యలేమిటి? మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఎలాంటి చర్యలు అవసరం? వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అందిస్తాననే సందేశంతో ఓటర్ల మద్దతు కోరుతున్నారు.

అభివృద్ధే ప్రధాన ఎజెండా...

డివిజన్‌లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల మెరుగుదల స్థానిక ప్రజలకు కీలకం. ఈ అంశాలపై దృష్టి సారించి, ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే ప్రతినిధి అవసరాన్ని ఆమె ప్రచారంలో ప్రస్తావించవచ్చు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకే పరిమితం కాకుండా, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం ద్వారా నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన సవాలు.

25 కిలోల బస్తా కాస్తా.. 26 కిలోలైంది

- జీఎస్టీ భారాన్ని తగ్గించుకునేందుకేనా.?
- ప్యాకేజింగ్ నిబంధనల మినహాయింపులపై వ్యాపారుల దృష్టి
- వినియోగదారులకు లాభమా.? నష్టమా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సాధారణంగా బియ్యం కొనుగోలు చేసేటప్పుడు 25 కిలోల బస్తాలే ఎక్కువగా కనిపించేవి. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో 26 కిలోల బియ్యం బస్తాలు కూడా విక్రయిస్తుండటం వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. బస్తా బరువును ఒక కిలో పెంచడం వెనుక అసలు కారణమేంటి.? అదనంగా కిలో బియ్యం ఇవ్వడం వల్ల వ్యాపారులకు కలిగే ప్రయోజనం ఏమిటి.? ఇది చట్టబద్ధమైన పద్ధతేనా.? లేక జీఎస్టీ భారాన్ని తప్పించుకునేందుకు అనుసరిస్తున్న వ్యూహమా.? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

జీఎస్టీ నిబంధనలే కారణమా.?

బియ్యం బస్తాల బరువును 25 కిలోల నుంచి 26 కిలోలకు పెంచడం వెనుక గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ), ప్యాకేజింగ్‌కు సంబంధించిన నిబంధనలు ప్రధాన కారణాలుగా చర్చకు వస్తున్నాయి. 2022 జూలైలో కేంద్ర ప్రభుత్వం ప్యాక్ చేసి, లేబుల్ చేసిన కొన్ని ఆహార ధాన్యాలపై 5 శాతం జీఎస్టీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నిర్ణయం బియ్యం వ్యాపారంపైనా ప్రభావం చూపింది. నిర్దిష్ట నిబంధనలకు అనుగుణంగా ముందుగానే ప్యాక్ చేసి, లేబుల్ చేసిన బియ్యం వంటి ఆహార ధాన్యాలపై పన్ను వర్తించే పరిస్థితి ఏర్పడింది. దీంతో బియ్యం మిల్లులు, వ్యాపారులు ప్యాకేజింగ్ పరిమాణంలో మార్పులు చేయడం ద్వారా పన్ను భారాన్ని తగ్గించుకునే అవకాశాలపై దృష్టి సారించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇందులో భాగంగానే 25 కిలోల బస్తాల స్థానంలో 26 కిలోల బస్తాలను విక్రయించే విధానం ప్రాచుర్యంలోకి వచ్చినట్లు చెబుతున్నారు.

25 కిలోలు దాటితే పన్ను మినహాయింపా.?

లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) రూల్స్, 2011 ప్రకారం 25 కిలోల కంటే ఎక్కువ బరువున్న కొన్ని ప్యాకేజీలకు రిటైల్ ప్యాకేజీలపై వర్తించే నిర్దిష్ట నిబంధనల నుంచి మినహాయింపులు ఉంటాయి. ఈ నిబంధనను ఆధారంగా చేసుకుని కొన్ని రైస్ మిల్లులు 25 కిలోల బస్తాల స్థానంలో 26 కిలోల బస్తాలను విక్రయించడం ప్రారంభించాయి.అయితే, 25 కిలోలకు బదులుగా 26 కిలోల బస్తా విక్రయించినంత మాత్రాన ప్రతి సందర్భంలోనూ జీఎస్టీ నుంచి మినహాయింపు లభిస్తుందని భావించకూడదు. ప్యాకేజింగ్‌కు సంబంధించిన చట్టపరమైన మినహాయింపులు, జీఎస్టీ చట్టం కింద పన్ను వర్తింపునకు సంబంధించిన నిబంధనలు వేర్వేరు అంశాలు. సంబంధిత చట్టపరమైన అర్హతలు, లావాదేవీ స్వరూపం ఆధారంగానే పన్ను వర్తింపును నిర్ణయించాల్సి ఉంటుంది.

తమిళనాడు నుంచి ఇతర ప్రాంతాలకు

2022లో తమిళనాడులోని తిరుప్పూర్ ప్రాంతంలో కొన్ని రైస్ మిల్లులు 25 కిలోల బస్తాలకు బదులుగా 26 కిలోల బస్తాలను విక్రయించడం ప్రారంభించాయని చెబుతున్నారు. అనంతరం ఈ విధానం దేశంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరించినట్లు వార్తలు వచ్చాయి. బస్తా బరువులో ఒక కిలో పెంపు వెనుక ప్యాకేజింగ్ నిబంధనల మినహాయింపులు, పన్ను భారాన్ని తగ్గించుకునే అవకాశాలపై వ్యాపార వర్గాలు చూపిన ఆసక్తి ఉన్నట్లు తెలుస్తోంది.

ఇది చట్టబద్ధమేనా.? చట్టవిరుద్ధమా.?

బియ్యం బస్తా బరువును 25 కిలోల నుంచి 26 కిలోలకు పెంచినంత మాత్రాన ఆ విధానాన్ని చట్టవిరుద్ధమని చెప్పలేం. అయితే, ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనల్లో లభించే మినహాయింపులను జీఎస్టీ మినహాయింపుతో సమానంగా చూడటం సరికాదు. ఒక ప్యాకేజీకి లీగల్ మెట్రాలజీ నిబంధనల ప్రకారం మినహాయింపు ఉన్నప్పటికీ, దానిపై జీఎస్టీ వర్తిస్తుందా లేదా అన్నది సంబంధిత పన్ను నిబంధనల ఆధారంగానే నిర్ణయించాలి. అందువల్ల 26 కిలోల బస్తాలను విక్రయిస్తున్న వ్యాపారులు పన్ను మినహాయింపును పొందే ముందు వర్తించే చట్టపరమైన నిబంధనలను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. కేవలం బస్తా బరువును పెంచడం ద్వారా జీఎస్టీ నుంచి తప్పించుకోవచ్చని సాధారణంగా నిర్ధారించలేం.

వినియోగదారులకు నిజంగా లాభమా.? నష్టమా.?

26 కిలోల బస్తాలో అదనంగా ఒక కిలో బియ్యం లభిస్తుండటం వినియోగదారులకు ప్రయోజనకరంగా కనిపించవచ్చు. కానీ బస్తా బరువు పెరిగిందనే కారణంతోనే వినియోగదారులకు ధర తగ్గినట్లు భావించకూడదు. బస్తా మొత్తం ధరతో పాటు కిలో బియ్యానికి ఎంత చెల్లిస్తున్నారో లెక్కించుకోవడం ముఖ్యం. ఉదాహరణకు, 25 కిలోల బియ్యం బస్తా ధర రూ.1,250 ఉంటే కిలో ధర రూ.50 అవుతుంది. అదే 26 కిలోల బస్తా ధర రూ.1,300 ఉంటే కిలో ధర కూడా రూ.50గానే ఉంటుంది. ఈ సందర్భంలో అదనంగా ఒక కిలో బియ్యం లభించినప్పటికీ, కిలో ధరలో ఎలాంటి తగ్గింపు ఉండదు.అదే 26 కిలోల బియ్యం బస్తాను రూ.1,250కే విక్రయిస్తే మాత్రం వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుంది. కిలో బియ్యం ధర సుమారు రూ.48.08కు తగ్గుతుంది. అందువల్ల బస్తాలో ఎన్ని కిలోల బియ్యం ఉందనే అంశంతో పాటు, మొత్తం ధర ఆధారంగా కిలోకు పడుతున్న ఖర్చును పోల్చి చూడాలి.

మొత్తంగా చూస్తే.. 25 కిలోల బియ్యం బస్తా 26 కిలోలుగా మారడం వెనుక ప్యాకేజింగ్ నిబంధనలు, జీఎస్టీ విధానం చర్చకు వస్తున్నప్పటికీ, ఈ మార్పు వల్ల వినియోగదారులకు ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందనేది విక్రయ ధరపై ఆధారపడి ఉంటుంది. బస్తా బరువు పెరిగిందని సంతోషించే ముందు కిలో ధరను లెక్కించుకోవడం అవసరం. అదే సమయంలో పన్ను మినహాయింపుల విషయంలో వ్యాపారులు సంబంధిత చట్టాలను పాటించాల్సి ఉంటుంది.

కీసరలో మట్టి మాఫియా బరితెగింపు

- అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు, టిప్పర్లు, హిటాచీ ఎక్స్‌కవేటర్ స్వాధీనం
- కేసు నమోదు చేసి బాధ్యులను రిమాండ్‌కు పంపడంలో అధికారుల జాప్యంపై అనుమానాలు

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) కీసర మండలంలో అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం కలకలం రేపుతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే గ్రావెల్, సాధారణ మట్టిని యథేచ్ఛగా తవ్వుతూ రవాణా చేస్తున్న ఘటన వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తోందన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అక్రమ తవ్వకాలు గుర్తించి వాహనాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ, బాధ్యులపై తదుపరి చర్యల విషయంలో స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సర్వే నంబర్లు 200/2, 138లో అక్రమ తవ్వకాలు..

2026 అక్టోబర్ 28న మేడ్చల్ ఆర్వీ అండ్ ఈఓ యూనిట్ అధికారులు, స్థానిక పోలీసు సిబ్బంది, గనుల శాఖ అధికారులు సంయుక్తంగా కీసర గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 200/2, 138లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారుల నుంచి అవసరమైన మైనింగ్ అనుమతులు పొందకుండానే టిప్పర్లు, హిటాచీ ఎక్స్‌కవేటర్ సహాయంతో గ్రావెల్, సాధారణ మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.ఈ అక్రమ కార్యకలాపాలకు సంబంధించి సింగారం నారాయణ, తండ్రి కిష్టయ్య పేరును అధికారులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలు, రవాణాకు ఉపయోగించిన నాలుగు వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనంలోకి నాలుగు వాహనాలు..

అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో టిప్పర్ నంబర్లు యూ08ఖూ8586, ు+08ు0981, యూ08ఖజు7277తో పాటు జూూ323ఙ3 గుర్తింపు వివరాలున్న హిటాచీ-220 ఎక్స్‌కవేటర్ ఉన్నాయి. అనుమతులు లేకుండా తవ్వకాలు, మట్టి రవాణా జరిగినట్లు గుర్తించిన నేపథ్యంలో బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు పోలీసులను కోరారు.

మట్టి తవ్వకాలు జరుగుతుంటే ఇన్నాళ్లూ ఏం చేశారు.?

అక్రమ తవ్వకాలు ఒక్కరోజులోనే ప్రారంభమయ్యాయా.? లేక కొంతకాలంగా కొనసాగుతున్నాయా.? అనుమతులు లేకుండా భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తుంటే సంబంధిత శాఖల పర్యవేక్షణ ఎక్కడుంది.? ఈ వ్యవహారంపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ముందస్తుగా తనిఖీలు నిర్వహించి అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు, ఫిర్యాదులు లేదా సమాచారం అందిన తర్వాతే స్పందిస్తున్నారా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వాహనాల స్వాధీనం మాత్రమే సరిపోతుందా.?

మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారా.? సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకున్నారా.? బాధ్యుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపే చర్యలు చేపట్టారా.? అన్న అంశాలపై అధికారులు పూర్తి వివరాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకోవడం ప్రారంభ చర్య మాత్రమేనని, అక్రమ తవ్వకాల వెనుక ఉన్న పూర్తి వ్యవహారాన్ని వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు.అధికారులు, మట్టి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తుల మధ్య ఏవైనా సంబంధాలు ఉన్నాయా.? అన్న అనుమానాలు కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులు స్పందించాలి..

కీసరలో అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, అనుమతులు, రవాణా వివరాలు, గతంలో అందిన ఫిర్యాదులు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ తవ్వకాలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.మట్టి మాఫియాకు అడ్డుకట్ట పడుతుందా.? లేక వాహనాల స్వాధీనంతోనే వ్యవహారం ముగుస్తుందా.? అన్నది వేచి చూడాల్సిందే.

కదిలే అంబులెన్స్‌లోనే కాన్పు.. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన మహిళ

- సమయస్ఫూర్తి చాటిన 108 ఈఎంటీ నరేష్, పైలట్ అశోక్
- డాక్టర్ సూచనలతో సురక్షిత ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం
- సిబ్బందిపై కుటుంబ సభ్యుల ప్రశంసల జల్లు

మేడ్చల్(ప్రశ్న న్యూస్) పురిటి నొప్పులతో అల్లాడుతున్న గర్భిణికి 108 అంబులెన్స్ ఈఎంటీ దేవుడిలా మారి పునర్జన్మనిచ్చారు. ఆసుపత్రికి చేరుకునేలోపే పురిటి నొప్పులు అధికం కావడంతో, కదిలే అంబులెన్స్‌లోనే అత్యవసరంగా డెలివరీ చేసి మానవత్వాన్ని, వృత్తిధర్మాన్ని చాటుకున్నారు. ఈఎంటీ చిమ్మని నరేష్ తెలిపిన వివరాల ప్రకారం కొంపల్లికి చెందిన పస్పుల సునీతకు గురువారం పురిటి నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది సునీతను మెరుగైన వైద్యం కోసం కొంపల్లి నుంచి సీఎంఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గుండ్లపోచంపల్లి పరిసర ప్రాంతాలకు చేరుకునేసరికి సునీతకు నొప్పులు మరింత తీవ్రమయ్యాయి. ఆసుపత్రికి చేరేంత సమయం లేకపోవడంతో పరిస్థితిని గమనించిన ఈఎంటీ చిమ్మని నరేష్ ఈఆర్సీపీ వైద్యురాలు డాక్టర్ స్మితతో ఫోన్ లో సలహాలు, సూచనలు తీసుకుంటూ వైద్యురాలి పర్యవేక్షణలో ఈఎంటీ నరేష్ సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్‌లోనే సురక్షితంగా డెలివరీ పూర్తి చేశారు. సునీత పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ప్రథమ చికిత్స అందించి, తల్లీబిడ్డలను సురక్షితంగా సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడిన 108 ఈఎంటీ చిమ్మని నరేష్, పైలట్ అశోక్‌లను బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

నాగబాబుకు పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు

- పర్యావరణ పరిరక్షణలో మరింత సేవలు అందించాలి
- ఏపీ గ్రీన్ చైర్మన్ బాధ్యతలకు వన్నె తీసుకొస్తారన్న విశ్వాసం
- సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించిన ఉప ముఖ్యమంత్రి

అమరావతి(ప్రశ్న న్యూస్) శాసన మండలి సభ్యుడు, ఏపీ గ్రీన్ ఛైర్మన్ నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాగబాబు మరింతగా ప్రజాసేవలో రాణించాలని, పర్యావరణ పరిరక్షణలో విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.నాగబాబును ఆప్యాయంగా లిచిన్నన్నయ్యలి అని సంబోధించిన పవన్ కల్యాణ్.. పర్యావరణ పరిరక్షణపై ఆయనకు సహజంగానే ఆసక్తి ఉందని పేర్కొన్నారు. ఏపీ గ్రీన్ ఛైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ఆ పదవికి మరింత గుర్తింపు తీసుకొస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాగబాబుకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు.

ఇక కబ్జా కుదరదు

- ఆర్.కె.పురం చెరువుకు 'హైడ్రా' కంచె

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం పక్కదారి పడుతోందా.. ఆ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి, బ్రాండెడ్ కంపెనీల పేర్లతో అధిక ధరలకు విక్రయిస్తున్నారా హైదరాబాద్‌లో పలు రైస్ డిపోలపై అధికారులు నిర్వహించిన తనిఖీలతో ఈ ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. కర్మన్‌ఘాట్ పరిధిలో సివిల్ సప్లయ్స్, విజిలెన్స్, జీఎస్టీ, తూనికలు కొలతల శాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటికి వచ్చాయి. ఈ సందర్భంగా బియ్యం బస్తాల బరువులో తేడాలు, లైసెన్సుల ఉల్లంఘనలు, అనుమానాస్పద బ్రాండింగ్ వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని రైస్ డిపోలపై అధికారులు దృష్టి సారించడానికి ప్రధాన కారణం బియ్యం బస్తాలపై ముద్రించిన బరువుకు, వాస్తవంగా ఉన్న బియ్యం పరిమాణానికి మధ్య తేడాలు ఉన్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తడమే. దీంతో అధికారులు బృందాలుగా ఏర్పడి హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపార కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని బస్తాలపై 26 కిలోల బియ్యం ఉన్నట్లు ముద్రించి ఉండగా వాటిని తూకం వేసినప్పుడు కేవలం 24 కిలోలు, 25 కిలోల మధ్య మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బస్తాపై పేర్కొన్న బరువుకు తగినంత బియ్యం లేకపోతే కొనుగోలుదారులు నష్టపోయే అవకాశం ఉంది. ఈ విధంగా వినియోగదారులను మోసం చేయడమే కాకుండా, వర్తించే పన్ను నిబంధనలను ఉల్లంఘించే అవకాశం కూడా ఉందని అధికారులు అనుమానిస్తున్నారు.

రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి బ్రాండెడ్ పేర్లతో విక్రయం?

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని కొందరు వ్యాపారులు అక్రమంగా సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ బియ్యాన్ని పాలిష్ చేసి బస్తాల్లో నింపి, బ్రాండెడ్ కంపెనీల పేర్లతో మార్కెట్లో విక్రయిస్తున్నారనే అనుమానంతో అధికారులు నమూనాలను సేకరించారు. సాధారణంగా రేషన్ బియ్యం ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు చేరాలి. అది అక్రమంగా ఇతర మార్గాల్లోకి వెళ్లి.. ప్రాసెసింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో అధికారులు బియ్యం నమూనాలను ల్యాబ్‌లకు పంపించి వాటి స్వభావం, నాణ్యత, ఇతర వివరాలను పరిశీలించేందుకు చర్యలు చేపట్టారు. కొన్ని బియ్యం బస్తాలపై కనిపించిన ట్రేడ్‌మార్కులు, ఇతర ప్రాంతాల్లో తనిఖీల సందర్భంగా గుర్తించిన బస్తాలపై ఉన్న గుర్తులతో పోలి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ బ్రాండ్ల అసలు యజమానులు ఎవరు.. బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది.. వాటి సరఫరా వెనుక ఎవరున్నారు.. అనే అంశాలపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన అంశం బియ్యం బస్తాల బరువు, జీఎస్టీ నిబంధనలు. బస్తాపై 26 కిలోలు అని ముద్రించి.. 25 కిలోలు, అంతకంటే తక్కువ బియ్యం విక్రయిస్తే అది వినియోగదారుడిని మోసం చేయడమే కాకుండా.. జీఎస్టీ నిబంధనల ఉల్లంఘనకు కూడా దారితీయవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. 25 కిలోల లోపు ఉన్న కొన్ని ప్రీ ప్యాకేజ్డ్, లేబుల్ చేసిన ఆహార ధాన్యాలపై 5 శాతం జీఎస్టీ విధిస్తారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588